





- దశావతార సన్నిధిలో స్వీకరించిన జనసేనాని
- తిరుమల లడ్డూ తయారీలో కల్తీ దుర్మార్గమైన చర్య
- హిందువుల మనోభావాలను దెబ్బతీసిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టమని హెచ్చరిక

పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష

పెదకాకాని, సెప్టెంబరు 22: కలియుగ ప్రత్యక్షదైవం వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ఘోర అపచారం జరిగింది. అమృతతుల్యంగా.. పరమ పవిత్రంగా భావించే తిరుమల లడ్డూ ప్రసాదం అపవిత్రమైంది. సనాతన ధర్మాన్ని నమ్మే ప్రతి ఒక్కరూ ఇందుకు ప్రాయశ్చిత్తం చేసుకోవాల్సిందే.. అంటూ జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదివారం 'ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. 11 రోజులు కొనసాగే ఈ దీక్షను ఆయన గుంటూరు సమీపంలోని నాగార్జున వర్సిటీ ఎదుట నంబూరు పరిధిలోని దశావతార వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వీకరించారు. దీక్ష అనంతరం తిరుమల శ్రీవారిని జనసేనాని దర్శించుకోనున్నారు. దీక్ష చేపట్టేందుకు వచ్చిన పవన్‌కల్యాణ్‌కు ఆలయ నిర్వాహకులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లకు పవన్ కల్యాణ్ పట్టువస్త్రాలు సమర్పించారు. తొలుత ఆలయంలో విఘ్నేశ్వరుడికి పూజ చేశారు. వేద పండితులు ప్రత్యేక పూజల అనంతరం మహాలక్ష్మి అమ్మవారిని దర్శించు కున్నారు. తిరుమల లడ్డూ ప్రసాదం అపవిత్రమైన నేపథ్యంలో క్షమించమని వేంకటేశ్వరస్వామిని కోరుతూ ఆయన దీక్ష మాలధారణ తీసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీవారి మహాప్రసాదమైన లడ్డూను కల్తీ చేయడం దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి హిందువు, ధర్మాన్ని పాటించే ప్రతీ వ్యక్తి దీన్ని ఖండించి పోరాడాలన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ సంస్కరణల పేరుతో స్వామివారి పూజా విధానాలను కూడా మార్చేసిందన్నారు. రామ తీర్థం ఆలయంలో రాముడి విగ్రహానికి శిరచ్ఛేదం చేస్తే ఆ ఘటనపై పోరాటానికి చిలకలూరిపేట నుంచి ముస్లింలు వచ్చి మద్దతు ఇచ్చారని తెలిపారు. తమది కక్ష సాధింపు ప్రభుత్వం కాదని అలాగని ఎవరైనా తప్పులు చేస్తే ఉపేక్షించే ప్రభుత్వం కూడా కాదన్నారు. తిరుమలలో జరిగిన ఘటన ఇంకెక్కడా భవిష్యత్తులో జరగకుండా చూసేలా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. తిరుమలలో స్వామివారి ప్రసాదంలో కల్తీ జరుగుతుంటే అధికారులు, బోర్డు సభ్యులు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టమని హెచ్చరిం చారు. ఈ అపరాధంతో సంబంధం లేక పోయినా తాను ప్రాయశ్చిత్త దీక్ష తీసు కున్నట్లు చెప్పారు.



దశావతార సన్నిధిలో దీక్ష తీసుకుంటున్న పవన్‌కల్యాణ్

అభిమానోత్సాహం..

పవన్‌రాకతో ఆలయ ప్రాంగణం అభిమానులతో నిండి పోయింది. పెద్ద సంఖ్యలో అభిమానులు అక్కడికి చేరుకుని పవన్‌కల్యాణ్‌కు నీరజనాలు పలికారు. ఆలయంలో ప్రవేశించేటప్పుడు పవన్‌కల్యాణ్‌పై పూలవర్షం కురిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు లింగమనేని రమేష్, లింగమనేని పూర్ణ భాస్కరరావు దంప తులు, శాసనమండలి సభ్యులు హరిప్రసాద్, పొన్నూరు నియోజకవర్గ జనసేన నాయకురాలు పార్వతి నాయుడు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎన్‌వోసీ రద్దు.. ఆగని నిర్మాణాలు

- గ్రీన్‌గ్రేస్‌పై ఏడాది క్రితమే రైల్వే నిర్ణయం
- చర్యలపై జీఎంసీకి రైల్వే సీనియర్ డీఈఎన్ లేఖ
- నోటీసులతో సరిపెట్టిన అప్పటి కమిషనర్ కీర్తి
- నాటి వైసీపీ నేతల ఆదేశాలతో తదుపరి చర్యలకు వెనకడుగు

గుంటూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర నడిబొడ్డున స్వామి థియేటర్‌కు సమీపంలో నిర్మిస్తున్న గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్ ఆకాశ హర్మ్యాలకు రైల్వే శాఖ ఎన్‌వోసీని గత ఏడాదే రద్దు చేసింది. జీ+4 భవనాలకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకుని ఆ తర్వాత జీ+15 నిర్మాణాలు చేపట్టడంతో రైల్వే శాఖ అధికారులు క్షేత్రపరిశీలన చేసి అనుమతులను ఉల్లంఘించినట్లు నిర్ధారించారు. రైల్వే సరిహద్దు నుంచి కేవలం 24.38 మీటర్ల దూరంలోనే నిర్మాణాలు జరుగుతుండటంతో సెట్ బ్యాక్ నిబంధనలు ఉల్లంఘించినట్లు తేల్చారు. రైల్వే సీనియర్ డీఈఎన్ (కో-ఆర్డినేషన్) జేవీ అనూష నేతృత్వంలో అధికారులు పరిశీలించి ఎన్‌వోసీ రద్దు చేసినట్లుగా అప్పటి నగరపాలకసంస్థ కమిషనర్ కీర్తి చేకూరికి సమాచారం ఇచ్చారు. దీని ఆధారంగా గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్స్ నిర్మాణాలు నిలిపేయాలని కమిషనర్ స్టాప్ ఆర్డర్ జారీ చేసినట్లు అధికారవర్గాలు తెలిపాయి. అయితే అప్పటి వైసీపీ నేతల ఒత్తిళ్లతో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో నిన్నమొన్నటి వరకు నిర్మాణాలు నిరాటంకంగా కొనసాగుతూ వచ్చాయి. ఆదిత్య ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ సంస్థ 2015లో జూట్‌మిల్లు స్థలంలో జీ+4 అపార్టుమెంట్ భవన నిర్మాణానికి రైల్వే శాఖకు ఎన్‌వోసీ కోసం దరఖాస్తు చేయగా అప్పటి దక్షిణ మధ్య రైల్వే హెడ్‌క్వార్టర్స్ సీజీఈ పరిశీలించి అనుమతి ఇచ్చారు. ఎన్‌వోసీ ఆధారంగా కరెస్పాండింగ్ డ్రాయింగ్స్‌ని జారీ చేశారు. అయితే 2023లో రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ /పీవే/ గుంటూరు రైల్వే సీనియర్ డీఈఎన్ (కో-ఆర్డినేషన్) దృష్టికి జీ+4కు అనుమతి తీసుకుని జీ+15 నిర్మిస్తున్న విషయాన్ని తీసుకెళ్లారు. పేరు కూడా భజరంగ్ అర్బన్ ప్రైవేటు లిమిటెడ్‌గా మార్పు చేశారని నివేదించారు. దీనికి రైల్వే నుంచి ఎలాంటి ఎన్‌వోసీ తీసుకోలేదన్నారు. కాగా సెట్‌బ్యాక్‌కు అవసరమైన స్థలాన్ని విడిచి పెట్టడంలో ఉల్లంఘనలు ఉన్నాయని తెలిపారు. మెయిన్ బిల్డింగ్ ప్రస్తుత ఎత్తు 13 మీటర్లుగా ఉందని, ఇది అనుమతి తీసుకున్న జీ+4కి చాలా ఎక్కువని చెప్పారు. అంతేకాకుండా సెల్లార్ నిర్మాణం రైల్వే హద్దుకు సమీపంలో చాలా ప్రమాదకరంగా ఉందన్నారు. ఈ ఉల్లంఘనలన్నింటిని పరిగణనలోకి తీసుకున్న రైల్వే సీనియర్ డీఈఎన్ ఎన్‌వోసీ నిబంధనలు ఉల్లంఘించినందున గతంలో ఇచ్చిన అనుమతి రద్దు అయినట్లే భావించాల్సిందిగా గుంటూరు నగరపాలకసంస్థ కమిషనర్‌ను అడ్రస్ చేస్తూ లేఖ పంపారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు తక్షణమే తగిన చర్యలు చేపట్టాలన్నారు. భజరంగ్ అర్బన్ ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు కూడా నిర్మాణాలు నిలిపేయాలన్నారు.

అన్ని వేళ్లు కార్పొరేషన్ వైపే

రైల్వే శాఖ ఎన్‌వోసీని రద్దు చేస్తూ ఏకంగా అప్పటి కమిషనర్ కీర్తి చేకూరికి లేఖ రాశారు. ఆమె సాధారణ అపార్టుమెంట్ల ప్లాన్ల విషయంలో స్వయంగా తానే పరిశీలించి అన్నింటిని చూసి సవ్యంగా ఉంటేనే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేసేవారు. అలాంటిది గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్ల వైపు ఎందుకు కన్నెత్తి అయినా చూడలేదో అర్థం కాని పరిస్థితి. గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్లు నిర్మిస్తున్నది అప్పటి మంత్రి అంబటి రాంబాబు సోదరుడు మురళీకృష్ణ కావడమే ఏకైక కారణంగా కనిపిస్తున్నది. కేవలం స్టాప్ ఆర్డర్‌తో చేతులు దులుపుకున్నారు. అప్పటి నగర పాలకసంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు, గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్స్ నిర్మాణదారులతో చేతులు కలిపినట్లు పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆరోపిస్తున్నారు. అసలు ఇప్పటివరకు రైల్వే శాఖ జారీ చేసిన ఎన్‌వోసీ రద్దు, కార్పొరేషన్ ఇచ్చిన స్టాప్ ఆర్డర్స్‌ని ఎందుకు బహిర్గతం చేయలేదని ఆయన ప్రశ్నించారు. స్టాప్‌వర్క్ ఆర్డర్స్ ఉన్నా భజరంగ్ అర్బన్ ఇన్‌ఫ్రా సంస్థ పనులు కొనసాగించడం వల్ల పక్కనే ఉన్న చిన్నచిన్న భవనాలు పునాదులు దెబ్బతిన్నాయన్నారు. అవి ఏ క్షణాన నేలకొరుగుతాయోనన్న భయాందోళన యజమానుల్లో నెలకొన్నదని చెప్పారు. రైల్వే శాఖ పంపిన ఎన్‌వోసీ రద్దు ఆదేశాల లేఖని కార్పొరేషన్‌లో మాయం చేసినట్లు తమకు అనుమానం కలుగుతుందన్నారు. దీనికి సంబంధించి బాధ్యులపై చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

బదిలీల జాతర

- జడ్పీ సీఈవోగా జ్యోతిబసు
- జిల్లా అటవీశాఖాధికారిగా హిమశైలజ
- డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా విజయలక్ష్మి
- మైనింగ్ జిల్లా అధికారిగా శ్రీవెంకటసాయి
- ఉమ్మడి గుంటూరులో 57 మంది ఎంపీడీవోల బదిలీ

బాపట్ల(ఆంధ్రజ్యోతి), గుంటూరు సిటీ, సెప్టెంబరు 22: బదిలీల నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌లో ప్రక్షాళన జరిగింది. జడ్పీ కార్యాలయంతోపాటు, 57 మండలాల్లో ఎక్కువ మంది సిబ్బందికి స్థాన చలనం కలుగుతుంది. జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా, ఇన్‌చార్జి సీఈవో మోహన్‌రావు బదిలీ లపై చేపట్టిన కసరత్తు ఆదివారం అర్ధరాత్రికి కొలిక్కి వచ్చి నట్లు సమాచారం. ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలను పరిగణనలోకి తీసుకుంటూనే, నిబంధనలను అమలు చేయాలన్న ఆలోచనతో బదిలీల జాబితాను రూపొందిస్తున్నట్లు తెలి సింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 57 మండలాల్లో ఎంపీడీవోలకు స్థానచలనం జరగనుంది. ప్రస్తుతం 43 మం ది ఎంపీడీవోలు ఉండగా వారిలో 8 మంది పక్క జిల్లాలకు వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్నారు.



బదిలీల జాబితాపై ఆదివారం రాత్రి కసరత్తు చేస్తున్న ఇన్‌చార్జి సీఈవో మోహన్‌రావు

ఉమ్మడి జిల్లా పరిధిలో బదిలీకి 30 మంది దరఖాస్తు చేసుకోగా ఐదుగురు దర ఖాస్తు చేసుకోలేదు. దరఖాస్తు చేసుకున్న వారి బదిలీలు లాంఛనమే అని సమాచారం. 16 మంది ఎంపీడీవోలు ఉమ్మడి గుంటూరు జిల్లాకు కొత్తగా రాగా వారికి మండలాల కేటాయింపుపై కసరత్తు చేపట్టారు. పల్నాడు జిల్లాకు చెందిన కొందరు ఎమ్మెల్యేలు ఆదివారం సాయంత్రం కూడా ఎంపీడీవోల బదిలీలపై జడ్పీ అధికారులకు ఫోన్లు చేస్తూనే ఉన్నారు. ఎమ్మెల్యేల సిఫార్సు చేయడంతో తదనుగుణంగా జాబితాను రూపొందించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇన్‌చార్జి సీఈవో మోహన్‌రావు జిల్లాలో కొనసాగేందుకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఆయనకు స్థానచలనం కలగనుంది. డ్వామా పీడీ పోస్టు కోసం దరఖాస్తు చేసినా ప్రభుత్వం తీసుకున్న పాలసీ వల్ల ఆయన జిల్లా దాటి వెళ్లాల్సి వస్తుంది.

జఠిలంగా బదిలీల ప్రక్రియ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి సారి జరుగుతున్న బదిలీలు కావడంతో కార్యాలయ అధికారులు, సిబ్బంది బదిలీలు జడ్పీలో జఠిలంగా మారాయి. జడ్పీ కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది మార్పునకు సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం కీలక స్థానాల్లో ఉన్న వారిలో చాలా మంది వైసీపీ హయాంలో వచ్చిన వారే. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఎమ్మెల్యేలు జడ్పీలోని 9 మంది ఏవోల బదిలీపై సూచనలు చేసినట్లు తెలుస్తోంది. వారి స్థానంలో కొత్త వారి పేర్లను ప్రతిపాదించి సిఫార్సు లేఖలు జడ్పీకి పంపినట్లు సమాచారం. ఆరుగురు సీనియర్ అసిస్టెంట్లు, 11 మంది జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు టైపిస్టుల బదిలీపై రాజకీయ ఒత్తిడి ఉన్నట్లు సమాచారం. వైసీపీ హయాంలో ఓ సామాజికవర్గం లక్ష్యంగా బదిలీలు జరిగాయన్న విమర్శలు వచ్చాయి. అప్పుడు అన్యాయం జరిగిన వారికి ఇప్పుడు ప్రాధాన్యం కల్పించే దిశగా అడుగులు పడుతున్నట్లు సమాచారం.

అధికారుల బదిలీలు ఇలా..

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో పలువురు అధికారులు బదిలీ అయ్యారు. బదిలీ అయిన వారిలో కీలక విభాగాలకు చెందిన అధికారులు ఉన్నారు. జడ్పీ సీఈవోగా వీ జ్యోతిబసు, డిప్యూటీ సీఈవోగా సీహెచ్ కృష్ణ నియమితులయ్యారు. ఇక జడ్పీ ఇన్‌చార్జి సీఈవో మోహన్‌రావుని నెల్లూరుకు బదిలీ చేశారు. జిల్లా అటవీశాఖ అధికారి కే మహబూబ్‌బాషా బదిలీ కాగా ఆ స్థానంలో ఎం హిమశైలజను నియమించారు. చాలాకాలంగా గుంటూరు గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీగా పనిచేస్తున్న వై హరిహరనాథ్‌ను మాతృ శాఖ అయిన పంచాయతీరాజ్‌కి బదిలీ చేయగా, ఆ స్థానంలో డ్వామాలో డీఎల్డీవోగా పనిచేస్తున్న టీవీ విజయలక్ష్మిని నియమించారు. జిల్లా పంచాయతీ అధికారి కే శ్రీదేవి నెల్లూరు జిల్లా కందుకూరుకు బదిలీ కాగా ఆ స్థానంలో నాగసాయి రానున్నారు. తెనాలి డీ ఎల్డీవో కే పద్మావతిని చీరాలకు బదిలీ చేసి ఆ స్థానం లో కందుకూరు డీఎల్డీవో పీ పద్మజను నయమించారు. బాపట్ల డీఎల్డీవోగా జీవీ నారాయణరెడ్డిని, రేపల్లె డీఎల్డీవోగా పీ పద్మ నియమితులయ్యారు. బాపట్ల డ్వామా, డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీగా ఉన్న వై పిచ్చిరెడ్డిని గుంటూరు డీఎల్డీవోగా నియమించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జడ్ రమేష్ తెనాలి నుంచి విజయవాడకు, జీ అశోక్ పర్చూరు క్వాలిటీ కంట్రోల్‌కు, జే హరేరామకృష్ణ ఒంగోలు నుంచి బాపట్లకు, జీ ముత్యంబాబు బాపట్ల నుంచి తెనాలికి బదిలీ అయ్యారు. బాపట్ల డీపీవో రవికుమార్‌ను కాకినాడ జిల్లాకు బదిలీ చేసి ఆ స్థానంలో కేఎల్ ప్రభాకర్‌రావును నియమిస్తూ ప్రభు త్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూరు జిల్లా డ్వామా విజిలెన్స్ విభాగం జిల్లా అధికారిగా విధులు నిర్వహిస్తున్న విజయలక్ష్మిని బాపట్ల జిల్లా డ్వామా పీడీగా నియమితులయ్యారు. గుంటూరు జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారి ఎస్‌కేవీ సత్య నారాయణని చిత్తూరుకు బదిలీ చేసి ఏపీ ఎండీసీలో విధులు నిర్వహిస్తున్న ధూళిపాళ్ల శ్రీవెంకటసాయిని ప్రభుత్వం ఇక్కడ నియమించింది.



వైసీపీతో అంటకాగినా.. అందలమే

- దేవదాయశాఖలో కొనసాగుతున్న వివాదాస్పద అధికారులు
- కూటమి ప్రభుత్వంలోనూ వారికి అదే స్థానాలపై వెల్లువెత్తుతున్న విమర్శలు

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 22: గత వైసీపీ ప్రభుత్వంలో గుంటూరు జిల్లా దేవాదాయ శాఖలో కొందరు అధికారులు బరితెగించారు. నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వహించడమే కాకుండా అక్రమాలతో చెలరేగి పోయారు. అంతేగాకుండా అప్పటి ప్రతిపక్షం టీడీపీ అధినేత చంద్రబాబును నేరుగా విమర్శించడంతో పాటు సభలను కూడా అడ్డుకున్నారు. ఇలాంటి అధికారులపై కూటమి ప్రభుత్వంలో చర్యలు ఉంటాయని అందరూ అనుకున్నారు. కానీ వారు అదే స్థానాల్లో కొనసాగుతుం డటంపై దేవదాయ శాఖ లోని మిగిలిన అధికా రులు, ఉద్యోగులు మండిపడుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలతో ఐదేళ్లు అంటకాగి ఇప్పుడు కూడా వారి హవానే కొనసాగడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైసీపీ ప్రభుత్వానికి అప్పట్లో అనుకూలంగా పని చేయడమే కాకుండా అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడిన వారు ఇంకా అదే స్థానాల్లో కొనసాగడంపై విమర్శ లు వస్తున్నాయి.

- మంగళగిరిలో ఓ ఈవో అప్పటి వైసీపీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డితో చేతులు కలిపి పెద్ద కోనేరు తవ్వకాల్లో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆయనకు ఈవోగా కొనసాగే అర్హత లేనప్పటికీ తొలుత ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు చేపట్టారు. 2019లో గెలుపొందిన వైసీపీ ఎమ్మెల్యేలు ఇళ్లకు వెళ్లి మంగళగిరి నరసింహస్వామి ప్రసాదాన్ని అందజేసి ఎమ్మెల్యేలను ఆ అధికారి సత్కరించారు.
- జూనియర్ అధికారిగా ఉన్న ఓ అధికారిని వైసీపీ ప్రభుత్వం గుంటూరు దేవదాయశాఖలో కీలక పోస్టింగ్‌లో నియమించింది. ఇన్‌చార్జిగా కాకుండా రెగ్యులర్ పోస్టింగ్ చేస్తూ జగన్ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఇదే అవకాశంగా ఆ అధికారి పలు అంశాలకు సంబంధించి అడ్డగోలుగా ఉత్తర్వులు జారీతో పాటు నిబంధనలకు విరుద్ధంగా జీతాలు డ్రా చేశారన్న ఆరోపణలున్నాయి.



- గతంలో గుంటూరు ఏసీగా, ఇప్పుడు కీలక స్థానంలో ఉన్న ఓ అధికారి ఉద్యోగులను డబ్బుల కోసం వేధించడమే కాకుండా, గత ప్రభుత్వానికి అనుకూలంగా ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారని సమాచారం. వడ్లమూడి సంగంలో డీవీసీ ఆస్పత్రికి చెందిన కో ఆపరేటివ్ స్థలాన్ని దేవదాయశాఖ ఆస్తి కింద రిజిస్ట్రేషన్ జరిపించిన ఘటనపై అప్పట్లో సంగం డెయిరీ చైర్మన్ నరేంద్రకుమార్ హైకోర్టును ఆశ్రయించి స్టే తీసుకొచ్చారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో చంద్రబాబు బహిరంగ సభలకు దేవదాయశాఖ స్థలాలు ఇవ్వనివ్వకుండా ఆ అధికారి అడ్డుకున్నారు. పర్చూరులో జరిగిన చంద్రబాబు సభను అడ్డుకుని రైతులకు నోటీసులు ఇచ్చి వారిని భయభ్రాంతులకు గురిచేసిన సంఘటన అప్పట్లో వివాదాస్పదమైంది.
- గత ఏడాది సెప్టెంబరు 9న చంద్రబాబు అరెస్టు అయినప్పుడు గుంటూరులోని డీసీ కార్యాలయంలో ఓ అధికారి అనుచిత వ్యాఖ్యలు చేశారని తెలిసింది. బాబు అరెస్టు అయ్యాడు.. బాధపడే వారు రండి అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు అప్పట్లో పెద్ద దుమారం రేపాయి. ఇలాంటి అధికారులపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి. అప్పుడు వైసీపీ అండతో విర్రవీగి, ఇష్టారాజ్యంగా వ్యవహరించిన అధికారులపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోగా వారిని అదే స్థానాల్లో కొనసాగించేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై విమర్శలు వస్తున్నాయి.



వైసీపీకి జీ హుజూర్.. మళ్లీ పోస్టింగ్

ఐదేళ్ల ప్రకాశం జిల్లా ఇన్‌చార్జి డీపీవోగా ఉన్నతాధికారుల ఆదేశాలను కూడా లెక్క చేయకుండా వైసీపీ నేతల సేవలో తరించిన నారాయణరెడ్డికి తాజా బదిలీ ల్లో బాపట్ల డీఎల్‌డీవోగా పోస్టింగ్ దక్కింది. డీపీవోగా ఆయన పై అధికారుల అనుమతి లేకుండా నిబంధన లకు విరుద్ధంగా వైసీపీ నేతలు చెప్పినట్లుగా అప్పట్లో బదిలీలు చేపట్టారనే ఆరోపణలు కూడా ఆయనపై ఉన్నాయి. అద్దంకి, చీరాల, పర్చూరు పరిధిలో చేపట్టిన బదిలీలపై అప్పట్లో బాపట్ల జేసీ శ్రీనివాసులు నారా యణరెడ్డికి షోకాజ్ నోటీసులు కూడా జారీ చేశారు. ఆ తర్వాత ఆయన సెలవుపై వెళ్లారు. కాగా ప్రకాశం డీపీవోగా జీవీ నారాయణరెడ్డి పనిచేసిన కాలంలో జరిగిన అవక తవకలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని తాజాగా కలెక్టర్ వెంకట మురళికి చినగంజాం మండలానికి చెందిన కూటమి నేతలు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ప్రస్తుత బదిలీల్లో ఆయ నకు బాపట్ల డీఎల్‌డీవోగా పో స్టింగ్ ఇవ్వడంపై విమ ర్శలు వ్యక్తమవు తున్నాయి.

లాభసాటి వ్యవసాయమే లక్ష్యం

పొలం పిలుస్తోంది పోస్టర్ ఆవిష్కరణలో మంత్రి గొట్టిపాటి

అద్దంకి, సెప్టెంబరు 22: రైతుల సమస్యలను పరిష్కరించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అద్దంకి నియోజకవర్గ వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది పోస్టర్‌ను ఆదివారం చిలకలూరిపేటలోని తన నివాసంలో మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ, పశు సంవర్ధక, ఉద్యాన, మార్కెటింగ్ శాఖలతో పాటు శాస్త్రవేత్తలు కలిసి పంట పొలాల పరిశీలనతో పాటు గ్రామసభలు నిర్వహించి రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఉదయం 8-30 నుంచి మధ్యాహ్నం 1 వరకు ఒక గ్రామంలో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో గ్రామంలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్టూరు ఏడీఏ శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ అధికారులు వెంకటకృష్ణ, సుబ్బారెడ్డి, శ్రీనివాసరావు, ఎస్‌వీ కుమారి, పలువురు రైతులు పాల్గొన్నారు.



పొలం పిలుస్తోంది పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి

బిజినెస్

ఈ వారం మరో 11 ఐపీఓలు

14 కంపెనీల షేర్ల లిస్టింగ్

ముంబై: ఈ వారం కూడా పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) మార్కెట్ సందడిగా ఉండనుంది. దాదాపు రూ.900 కోట్ల సమీకరణ కోసం 11 కంపెనీలు ఐపీఓకు వస్తున్నాయి. ఇందులో మన్‌బా ఫైనాన్స్, కేఆర్ఎన్ హీట్ ఎక్స్ఛేంజర్ అండ్ రిఫ్రిజిరేషన్ అనే రెండు కంపెనీల ఐపీఓలు మాత్రమే మెయిన్‌బోర్డు కంపెనీల ఐపీఓలు. మిగతా తొమ్మిది ఎస్ఎంఈ కంపెనీలు. వీటికి తోడు ఈ వారం 14 కంపెనీల ఐపీఓల షేర్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో లిస్ట్ కానున్నాయి.

లీలా ప్యాలెస్ నుంచి రూ.5,000 కోట్ల ఐపీఓ

మరోవైపు లీలా ప్యాలెసెస్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ మాతృసంస్థ స్క్లోస్ బెంగళూరు లిమిటెడ్ కూడా రూ.5,000 కోట్ల ఐపీఓకు సిద్ధమవుతోంది. ఇందు కోసం ఆదివారం సెబీకి దరఖాస్తు సమర్పించింది. సెబీ ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకపోతే దేశ హాస్పిటాలిటీ చరిత్రలో ఇదే అతిపెద్ద ఐపీఓ కానుంది. రూ.5,000 కోట్ల ఐపీఓలో రూ.2,000 కోట్లు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా, మిగతా రూ.3,000 కోట్లు కొత్త ఈక్విటీ షేర్ల జారీ ద్వారా సమీకరిస్తారు.

కాగా సోలార్ ఎనర్జీ సొల్యూషన్స్ అందించే సోలార్91 క్లీన్‌టెక్ అనే ఎస్ఎంఈ కంపెనీ కూడా ఐపీఓకు సిద్ధమైంది. ఐపీఓ ద్వారా రూ.100 కోట్లు సమీకరించేందుకు సెబీకి దరఖాస్తు చేసింది.

పండగల సీజన్‌పై

లగ్జరీ కార్ల కంపెనీల భారీ ఆశలు

ఈ ఏడాది 50,000కు పైగానే విక్రయాలు



న్యూఢిల్లీ: పండగల సీజన్ దగ్గర పడుతోంది. దీంతో కార్ల కంపెనీలు ముఖ్యంగా మెర్సిడెజ్ బెంజ్, బీఎండబ్ల్యూ, ఆడి వంటి లగ్జరీ కార్ల తయారీ కంపెనీలు.. అమ్మకాలపై భారీగా ఆశలు పెట్టుకున్నాయి. ఇందుకోసం ఇప్పటికే మార్కెట్లో ఉన్న పాపులర్ మోడల్స్‌తో పాటు మరిన్ని కొత్త మోడల్స్ మార్కెట్లోకి విడుదల చేస్తున్నాయి. కొన్ని కంపెనీలు ఇప్పటికే కొన్ని లగ్జరీ మోడల్స్‌ను మార్కెట్లోకి విడుదల చేశాయి. మరికొన్ని కంపెనీలు వచ్చే వారం, పది రోజుల్లో మార్కెట్లోకి విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే పండగల సీజన్ ప్రత్యేక ఆఫర్లు మరో ఎత్తు. లగ్జరీ కార్ల కంపెనీలతో పాటు డీలర్లు కూడా తమవైన మరిన్ని ఆఫర్లు జోడిస్తున్నారు. దీంతో ఈ ఫెస్టివల్ సీజన్‌లో దేశంలో లగ్జరీ కార్ల అమ్మకాల వృద్ధి రేటు రెండంకెల్లో ఉంటుందని ఆశిస్తున్నట్టు మెర్సిడెజ్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ చెప్పారు.

'ఈవీ'ల జోష్

వ్యాపారంలో 'ట్రెండ్ ఈజ్ మై బెస్ట్ ఫ్రెండ్' అంటారు. లగ్జరీ కార్ల కంపెనీలూ ఈ మాటను బాగా వంట పట్టించుకున్నాయి. ఇందులో భాగంగా రెండు ప్రధాన నగరాల మధ్య ప్రయాణించేందుకు వీలుగా హైఎండ్ లగ్జరీ ఈవీలను మార్కెట్లోకి విడుదల చేస్తున్నాయి. మెర్సిడెజ్ బెంజ్ ఇప్పటికే తన మేబాక్ సీరిస్‌లో రెండు హైఎండ్ ఈవీలను విడుదల చేసింది. ఒకసారి చార్జింగ్ చేస్తే తమ ఈవీల్లో 600 నుంచి 800 కిలోమీటర్ల వరకు రీచార్జి అవసరం లేకుండా ప్రయాణించవచ్చని కంపెనీ ఇండియా ఎండీ సంతోష్ అయ్యర్ చెప్పారు. ఈవీలపై కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల పన్ను రాయితీలు కూడా ఇందుకు దోహదం చేస్తున్నాయి. ఇవన్నీ ఈ ఫెస్టివల్ సీజన్‌లో దేశంలో లగ్జరీ కార్ల అమ్మకాలకు బాగా కలిసొస్తుందని ఆశిస్తున్నట్టు ఆడి ఇండియా చీఫ్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ తెలిపారు.

జోరుగా అమ్మకాలు

గత ఏడాది మన దేశంలో 40 లక్షలకు పైగా కార్లు అమ్ముడయ్యాయి. అందులో లగ్జరీ కార్ల అమ్మకాలు రెండు శాతం కూడా లేవు. ఈ ఏడాది మాత్రం ఈ అమ్మకాలు 50,000 నుంచి 51,000 మధ్య ఉండే అవకాశం ఉందని మెర్సిడెజ్ బెంజ్ ఇండియా ఎండీ సంతోష్ అయ్యర్ చెప్పారు. హై ఎండ్ కార్లపై ప్రస్తుతం 28 శాతం జీఎస్‌టీకి తోడు మరో 20 శాతం సెస్ విధిస్తున్నారు. ఇది చాలదన్నట్టు రాష్ట్ర ప్రభుత్వాలు జీరో నుంచి 20 శాతం వరకు రోడ్ ట్యాక్స్ విధిస్తున్నాయి. ప్రభుత్వాలు ఈ పన్నులను హేతుబద్ధం చేస్తే దేశంలో లగ్జరీ కార్ల అమ్మకాలు మరింత జోరందుకుంటాయని కంపెనీలు చెబుతున్నాయి.

నోకియా, ఎరిక్సన్, సామ్‌సంగ్‌లకు వొడాఫోన్ ఐడియా 30,000 కోట్ల ఆర్డర్

న్యూఢిల్లీ: పీకల్లోతు ఆర్థిక కష్టాల్లో ఉన్న వొడాఫోన్ ఐడియా మరోసారి భారత టెలికాం మార్కెట్లో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రెడీ అవుతోంది. ఇందుకు పెద్దఎత్తున తన 4జీ సేవలను విస్తరించడంతో పాటు 5జీ సేవల ప్రారంభానికీ సిద్ధమవుతోంది. ఇందుకు అవసరమైన నెట్‌వర్క్ యంత్రపరికరాల కొనుగోలు కోసం నోకియా, ఎరిక్సన్, సామ్‌సంగ్ కంపెనీలకు 360 కోట్ల డాలర్ల (సుమారు రూ.30,000 కోట్లు) విలువైన కాంట్రాక్టు ఇచ్చింది. ఈ కంపెనీలు ఈ పరికరాల సరఫరా వచ్చే నెల నుంచే ప్రారంభిస్తాయి. 4జీ, 5జీ టెలికాం సేవల ద్వారా రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్ కంపెనీలతో దీటుగా పోటీపడవచ్చని వొడాఫోన్ ఐడియా భావిస్తోంది.

★ మారుతి సుజుకీ.. వ్యాగన్‌ఆర్ వాల్ట్జ్ లిమిటెడ్ ఎడిషన్‌ను తీసుకువచ్చింది. ఈ లిమిటెడ్ ఎడిషన్‌లో ప్రత్యేకమైన స్టైలింగ్, కొత్త ఫీచర్లను చేర్చింది. ఎల్ఎక్స్ఐ, వీఎక్స్ఐ, జెడ్ఎక్స్ఐ వేరియంట్స్‌లో వ్యాగన్‌ఆర్ వాల్ట్జ్ అందుబాటులో ఉండనుంది. 1లీటర్, 1.2 లీటర్ అడ్వాన్స్‌డ్ కే-సిరీస్ ఇంజన్‌తో అందుబాటులో ఉండనున్న ఈ కారు ధరలు రూ.5.64 లక్షలు- రూ.6.71 లక్షల (ఎక్స్‌షోరూమ్) మధ్యన ఉన్నాయి.

★ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ రెండు కొత్త క్రెడిట్ కార్డ్స్‌ను తీసుకువచ్చింది. మయూర, అశ్వ పేర్లతో ఈ కార్డులను అందుబాటులోకి తెచ్చింది. భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే విధంగా మయూర కార్డును డిజైన్ చేయగా ఆధునిక జీవనశైలికి అనుగుణంగా అశ్వ కార్డును రూపొందించింది.

★ బజాజ్ ఫిన్‌సర్వ్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ ప్రారంభించిన ఏడాది కాలంలోనే రూ.3,500 కోట్ల ఏయూఎం (ఆస్తుల నిర్వహణ)ను అధిగమించిందని బజాజ్ ఫిన్‌సర్వ్ మ్యూచువల్ ఫండ్ వెల్లడించింది. ఇప్పటికే ఈ ఫండ్ రెగ్యులర్ ప్లాన్ 41.30 శాతం, డైరెక్ట్ ప్లాన్ 43.43 శాతం రిటర్నులు అందించిందని తెలిపింది.

26,100 పైన బుల్లిష్

(సెప్టెంబరు 23-27 తేదీల మధ్య వారానికి)

ఆస్ట్రో గైడ్



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 25,849-25,336 పాయింట్ల మధ్యన కదలాడి 434 పాయింట్ల లాభంతో 25,791 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 26,100 పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25,530, 25,418, 25,238, 25,030 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 26,100 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 25,300
నిరోధ స్థాయిలు: 26,000, 26,100, 26,200 (25,900 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 25,600, 25,500, 25,400 (25,700 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



23వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	555
వరంగల్	527	గోదావరి	550
చిత్తూరు	553	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	116
వరంగల్	120	గుంటూరు	119
కరీంనగర్	120	ఒంగోలు	119
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	113
కర్నూలు	120	నెల్లూరు	113
విశాఖపట్నం	105	అనంతపురం	113
గోదావరి	116		

లాభాల స్వీకరణకు చాన్స్!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం ఆటుపోట్లకు లోనయ్యే అవకాశాలున్నాయి. అంతర్జాతీయ సంకేతాలు, యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్ల కోతతో మార్కెట్లలో ఊపు కనిపిస్తోంది. సూచీలు ఇప్పటికే గరిష్ఠాలకు చేరటంతో ఇన్వెస్టర్లు ఏ క్షణమైనా లాభాల స్వీకరణకు దిగే అవకాశం ఉంది. ఈ వారం నిఫ్టీకి 25,550 వద్ద మద్దతు స్థాయిలుండగా, 25,800 వద్ద నిరోధ స్థాయిలున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మెరుగైన సంకేతాలు రాకుంటే ప్రైస్ యాక్షన్ టైట్‌గా ఉండే అవకాశం ఉంది. బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల్లో బలం పెరుగుతోంది. ఎఫ్ఎంసీజీ, ఐటీ, ఫార్మా రంగాలు బుల్లిష్‌గా ఉన్నాయి.

స్టాక్ రికమండేషన్స్

జేఎస్‌డబ్ల్యూ స్టీల్: జూలై నెలలో జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ షేరులో దిద్దుబాటు మొదలైంది. 15 శాతం వరకు పతనమయ్యాయి. రూ.875 స్థాయిలో మద్దతు తీసుకున్న ఈ షేరు మూడు సార్లు రూ.970 వద్ద నిరోధాన్ని ఎదుర్కొంది. గత శుక్రవారం నాటి సెషన్లో భారీ వాల్యూమ్‌తో ఈ స్థాయిని అధిగమించిన ఈ షేరు 3.50 శాతం లాభంతో రూ.981 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.980/960 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,050/1,100 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.940 స్థాయిని స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

ఎల్ అండ్ టీ: కొన్ని నెలలుగా సైడ్‌వేస్‌లో చలిస్తున్న ఈ కౌంటర్‌లో ప్రైస్ యాక్షన్ టైట్ అవుతోంది. మరోసారి కీలక నిరోధ స్థాయి రూ.3,860కి చేరువ అవుతోంది. ఒకవేళ దీన్ని అధిగమిస్తే భారీ ర్యాలీకి ఆస్కారం ఉంది. లేదంటే పడినప్పుడు కొనుగోలు చేయటం మంచిది. గత శుక్రవారం ఈ షేరు 2.99 శాతం లాభంతో రూ.3,860 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.3,750/ 3,700 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.3,950 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.3,660 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

డీఎల్ఎఫ్: కొన్ని నెలల అప్‌ట్రెండ్ తర్వాత ఈ షేరులో మొదలైన కన్సాలిడేషన్ ఇంకా కొనసాగుతోంది. ప్రస్తుతం చక్కని బేస్ ఏర్పడుతోంది. ప్రస్తుతం ఈ షేరు కీలక నిరోధ స్థాయి రూ.870 వద్ద కదలాడుతోంది. గత శుక్రవారం 3.33 శాతం లాభంతో రూ.877 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో బ్రేకౌట్ జరిగే అవకాశం ఉంది. మూమెంటమ్ ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.870 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.950/990 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.845 స్థాయిని స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్కార్ట్స్ కుబోటా: జీవితకాల గరిష్ఠాన్ని అందుకున్న ఈ షేర్లలో 16% మేర కరెక్షన్ జరిగింది. సెప్టెంబరులో అక్యుములేషన్ కనిపించింది. గత శుక్రవారం గణనీయమైన వాల్యూమ్‌తో ఈ షేరు ఏకంగా 6.88% లాభంతో రూ.4,079 వద్ద క్రాస్‌లైన్ నిరోధాన్ని దాటింది. చక్కని రిస్క్ రివార్డుతో ఆకర్షణీయంగా కనిపిస్తున్న ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.4,050 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.4,350 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. రూ.3,950 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

మ్యాన్‌కైండ్ ఫార్మా: ఈ షేరులో ఈ ఏడాది ఆరంభంలో మొదలైన కరెక్షన్ ముగిసింది. ప్రస్తుతం ఈ షేరు కీలక నిరోధ స్థాయిని అధిగమించింది. మంచి స్ట్రెంత్‌తో నిలదొక్కుకుంటోంది. గత శుక్రవారం 4.52% లాభంతో రూ.2,355 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.2,525 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.2,600/ 2,750 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. రూ.2,500 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

టెక్ వ్యూ

26,000 చేరువలో నిఫ్టీ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం తొలి నాలుగు సెషన్లలో మైనర్ కరెక్షన్‌లో ట్రేడయినా శుక్రవారం బలమైన ర్యాలీ సాధించింది. నాలుగు రోజుల కరెక్షన్‌లో కూడా ప్రధాన మద్దతు స్థాయి 25,000 కన్నా పైన నిలకడగా ఉండడం మార్కెట్లో బలానికి సంకేతం. చివరికి వారం మొత్తం మీద 435 పాయింట్ల లాభంతో వారం గరిష్ఠ స్థాయి 25,800 చేరువలో ముగిసింది. గత కొద్ది వారాల్లో నిఫ్టీ ఎలాంటి కరెక్షన్ లేదా కన్సాలిడేషన్ లేకుండా 23,800 స్థాయి నుంచి 2,000 పాయింట్ల మేరకు రికార్డు ర్యాలీని సాధించింది. అయితే మిడ్‌క్యాప్ సూచీ తొలుత బలమైన కరెక్షన్ సాధించి 2,000 పాయింట్లు నష్టపోయినా శుక్రవారం బలమైన బౌన్స్‌బ్యాక్ సాధించి చివరికి 175 పాయింట్ల లాభంతో ముగిసింది. స్మాల్‌క్యాప్ సూచీ మాత్రం 170 పాయింట్ల నష్టంతో ముగిసింది. గత కొద్ది వారాలుగా మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు కరెక్షన్ సాధిస్తూ వస్తున్నాయి. మానసిక అవధి 26,000 వద్ద నిఫ్టీ అప్రమత్త సానుకూల ధోరణిలో ప్రారంభం కావచ్చు. తదుపరి దిశ తీసుకునే ముందు కన్సాలిడేషన్ ఏర్పడవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ధోరణి ప్రదర్శించినట్టయితే శుక్రవారం నాటి గరిష్ఠ స్థాయి 25,850 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మానసిక అవధి 26,000. ఇక్కడ కన్సాలిడేషన్ లేదా కరెక్షన్ ఉండవచ్చు.

బేరిష్ స్థాయిలు: మైనర్ మద్దతు స్థాయి 25,600 కన్నా దిగజారితే మైనర్ బలహీనతలో పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 25,400. భద్రత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో ప్రవేశిస్తుంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారంలో అన్ని సూచీల కన్నా మెరుగ్గా ట్రేడయి 1,850 పాయింట్ల మేరకు లాభపడి 53,800 వద్ద క్లోజయింది. ఈ వారంలో పుల్‌బ్యాక్ రియాక్షన్ ఏర్పడవచ్చు. ప్రధాన నిరోధం 54,000. సానుకూలత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. మద్దతు స్థాయి 53,300 కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది.

పాటర్న్: మధ్యకాలిక నెలవారీ చార్టుల ప్రకారం మార్కెట్ ఓవర్‌బాట్ స్థితిలో ఉన్నట్టు ఆర్ఎస్ఐ సూచీ సంకేతం ఇస్తోంది. గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తంగా ఉండాలన్న సంకేతం ఇది. మార్కెట్ ప్రస్తుతం 26,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిరోధం ఎదుర్కొంటోంది. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు		
నిరోధం :	25,850	25,930
మద్దతు :	25,760	25,700



ఎక్సైజ్‌లో సిఫారసుల వెల్లువ!

- బదిలీల కోసం మంత్రిపై పెరుగుతున్న ఒత్తిళ్లు
- ముఖ్య నగరాల్లో పోస్టింగుల కోసం విపరీతమైన పోటీ
- 'వైసీపీ' అధికారులకూ నేతల లేఖలు
- మాకు ఇప్పుడూ అన్యాయమేనా?
- వైసీపీ బాధిత అధికారుల ఆవేదన

అమరావతి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఎక్సైజ్ శాఖలో జరుగుతున్న బదిలీలకు సంబంధించి ఆ శాఖ మంత్రిపై తీవ్రమైన ఒత్తిళ్లు వస్తున్నాయి. ఒకప్పుడు కొన్ని బదిలీలను మాత్రమే రాజకీయ సిఫారసులపై చేస్తే, మిగిలినవి సమర్థత, సీనియారిటీ ఆధారంగా చేసేవారు. కానీ ఇప్పుడు ఉన్నతాధికారుల నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి వరకు అన్ని స్థాయిల పోస్టింగుల కోసం సిఫారసులు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా మద్యం షాపులు, బార్లు ఎక్కువగా ఉండే విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, ఏలూరు, ఇతర ముఖ్య నగరాల్లో పోస్టింగుల కోసం అధికారుల మధ్య పోటీ విపరీతంగా పెరిగింది. గత ప్రభుత్వంలో రెండుగా చీలిపోయిన ఎక్సైజ్ శాఖ ఏకీకరణ జరగడం, ప్రైవేటు మద్యం షాపుల పాలసీ వస్తుండటంతో ఎక్సైజ్‌లో పోస్టింగులకు డిమాండ్ పెరిగింది. ముఖ్య నగరాలు, పట్టణాలు ఎక్కువగా ఉండే జిల్లాలు కావాలని అధికారులు పోటీపడుతున్నారు. డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మూడు కేడర్ల అధికారులూ అవే కోరుకుంటున్నారు. ఈ క్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి పెద్దఎత్తున సిఫారసు లేఖలు తెచ్చుకుంటున్నారు. ఇదే అదనుగా గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన కొందరు అధికారులకూ మంత్రులు, కూటమి ఎమ్మెల్యేలు లేఖలు ఇవ్వడంపై విమర్శలొస్తున్నాయి. రాష్ట్రంలోనే అతిపెద్ద నగరమైన విశాఖపట్నంలో పోస్టింగుల కోసం విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఏఈఎస్, సీఐల వరకు అన్ని కేడర్ల పోస్టులకూ భారీగా పోటీపడుతున్నారు. అయితే ఆ జిల్లాలో తాను చెప్పిన వారికే పోస్టింగులు ఇవ్వాలని ఓ ఎమ్మెల్యే పట్టుబడుతున్నారు. ఈ జిల్లాలో పోస్టింగుల కోసం కొందరు మంత్రులు ఇచ్చిన సిఫారసుల లేఖలనూ పక్కన పెడుతున్నట్లు తెలిసింది. అయితే ఆ ఎమ్మెల్యే 'వైసీపీ' అధికారులకూ సిఫారసు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో ఆ నగరం రిజర్వ్ కోటాలోకి వెళ్లిపోయింది. విశాఖపట్నంలో పాతుకుపోయిన అధికారులకే పోస్టింగులు ఇప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ వ్యవహారంపై అటు రాజకీయ వర్గాల్లో, ఇటు అధికార వర్గాల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

అప్పుడూ.. ఇప్పుడూ

గత ప్రభుత్వంలో కీలక పోస్టుల్లో పనిచేసిన అధికారులు ఇప్పుడు మళ్లీ మంచి పోస్టుల కోసం ప్రయత్నిస్తున్నారు. ఎక్కువ కాలం విజయవాడలో పనిచేసిన అధికారి ఇప్పుడు మళ్లీ విజయవాడకు రావాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అప్పట్లో స్పెషల్ సీఎస్‌తో కలిసి ఆయన ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండానే బార్లకు మేలు చేసేందుకు ప్రభుత్వ మద్యం షాపులను మార్చేశారు. అప్పట్లో విశాఖపట్నంలో హవా సాగించిన మరో అధికారి ఇప్పుడు మళ్లీ అదే కావాలని ప్రయత్నిస్తున్నారు.

మహిళా అధికారులూ.. పోటాపోటీ

ఏలూరు డిప్యూటీ కమిషనర్ పోస్టు కోసం ఇద్దరు మహిళా అధికారుల మధ్య భారీ పోటీ ఏర్పడింది. వారిలో ఓ అధికారిపై 'వైసీపీ' ముద్ర ఉంది. గత ప్రభుత్వంలో డిస్టిలరీ విభాగంలో పని చేసి, అప్పటి బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డితో అంటకాగినట్లు విమర్శలున్నాయి. మరో అధికారి రాయలసీమలో పనిచేశారు. నాయకులు ఈ ఇద్దరికీ సిఫారసుల లేఖలు ఇవ్వడంతో పోటీ ఏర్పడింది. ఇక గుంటూరు ఈఎస్ పోస్టు కోసం కూడా ఇద్దరు మహిళా అధికారులు పోటీపడుతున్నారు. వారిలో ఓ అధికారి గత ప్రభుత్వంలో సెబ్‌లో చక్రం తిప్పారు. మద్యం డిపోలో పనిచేస్తున్న మరో అధికారి ఈ పోస్టు కోసం ప్రయత్నిస్తున్నారు. ఇక, గత ప్రభుత్వంలో అనామక పోస్టుల్లో పనిచేసిన అధికారులు ఇప్పుడు కూడా తమకు అన్యాయం జరుగుతుందేమోనని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. జేసీ స్థాయిలోని ఓ అధికారి గత ప్రభుత్వంలో బాధిత అధికారిగా ఉన్నారు. గత ప్రభుత్వంలో వేధింపులకు గురిచేయడంతో తాను ఇక్కడ ఉండలేనని, తెలంగాణకు వెళ్లిపోతానని కూడా దరఖాస్తు చేసుకున్నారు. అలాంటి వారికి ఇప్పుడైనా న్యాయం చేస్తారా? అనే సందేహాలు నెలకొన్నాయి.

డీఆర్‌డీఏ పీడీల బదిలీలు

23 మంది మున్సిపల్ కమిషనర్లు కూడా..

అమరావతి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలువురు డీఆర్‌డీఏ పీడీలతో పాటు మున్సిపల్‌శాఖ పలువురు కమిషనర్లను బదిలీ చేస్తూ ఆదేశాలిచ్చింది. భీమిలి డివిజన్ డీఎల్‌డీఓ బి.లక్ష్మీపతిని విశాఖపట్నం డీఆర్‌డీఏగా పీడీగా నియమించారు. అక్కడ పనిచేస్తున్న పీడీ ఎం.ఎస్ శోభారాణిని ఆమె సొంత శాఖ సాంఘికసంక్షేమశాఖకు బదిలీ చేశారు. గుంటూరు డ్వామా కార్యాలయంలో విజిలెన్స్ అధికారి టి.వి. విజయలక్ష్మిని గుంటూరు డీఆర్‌డీఏ పీడీగా నియమించారు. వెయిటింగ్‌లో ఉన్న డీఎల్‌డీఓ డి.ప్రతాప్‌రెడ్డిని కర్నూలు డీఆర్‌డీఏ పీడీగాను, నగరి డ్వామా క్లస్టర్ ఏపీడీగా ఉన్న టి.ఎన్. శోభన్‌బాబును తిరుపతి జిల్లా డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ పీడీగాను, కృష్ణా డ్వామాలో ఫైనాన్స్ మేనేజర్‌గా ఉన్న వి.నాగరాజకుమారిని నెల్లూరు డీఆర్‌డీఏ పీడీగా నియమించారు. చిత్తూరు డీఆర్‌డీఏ పీడీగా ఉన్న డీఎంకే తులసిని ఆమె సొంత శాఖ వాణిజ్య పనులశాఖకు రీపాట్రియేట్ చేశారు. శ్రీకాకుళం డ్వామా ఏడీగా ఉన్న డీఎల్‌డీఓ విద్యాసాగర్‌ను అనకాపల్లి డీఆర్‌డీఏ పీడీగా నియమిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. అదే విధంగా మున్సిపల్‌శాఖలోనూ బదిలీలు చేశారు. అదే విధంగా పలు జిల్లాలకు సంబంధించి ఎంపీడీఓల అంతర్‌జిల్లాల బదిలీలు కూడా చేపట్టారు. పలువురు ఎంపీడీఓలు ఇతర జిల్లాలకు బదిలీ చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ ఆదేశాలిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 23 మంది మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ మున్సిపల్ పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు ఇచ్చారు.

అటవీశాఖలో బదిలీలు, పోస్టింగ్‌లు

సాధారణ బదిలీల్లో భాగంగా అటవీశాఖలో 13మంది స్టేట్ క్యాడర్‌లోని అసిస్టెంట్, డిప్యూటీ కన్జర్వేటర్లను ప్రభుత్వం బదిలీ చేసి, పోస్టింగ్‌లు ఇచ్చింది. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. హెడ్ ఆఫీస్‌లోని ఎం.శామ్యూల్‌ను అనకాపల్లి డీఎఫ్‌వోగా, కృష్ణా జిల్లా డీఎఫ్‌వో కె.రాజశేఖర్‌రావును ప్రకాశం జిల్లా సోషల్ ఫారెస్ట్‌కు, ప్రకాశం డీఎఫ్‌వో పి.సునీతను కృష్ణా జిల్లాకు, ఏలూరు సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో ఎం.హిమశైలజను గుంటూరు డీఎఫ్‌వోగా, అన్నమయ్య జిల్లా డీఎఫ్‌వో టి.నాగమణేశ్వరిని నంద్యాలకు, చింతపల్లి సోషల్ డీఎఫ్‌వో సీహెచ్ సూర్యనారాయణను ఏలూరు సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వోగా, పాడేరు డీఎఫ్‌వో కె.వినోద్‌కుమార్‌ను శ్రీసత్యసాయి జిల్లా సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వోగా, రాజమండ్రి ఏసీఎఫ్ టి.చక్రపాణిని శ్రీసత్యసాయి డీఎఫ్‌వోగా, పల్నాడు డీఎఫ్‌వో ఎన్.రామచంద్రరావును మంగళగిరి ఎఫ్‌యూఓగా, తిరుపతి డీఎఫ్‌వో జి.సతీష్‌ను ఎన్టీఆర్ జిల్లా డీఎఫ్‌వోగా, గిద్దలూరు డీఎఫ్‌వో వై.వి.నరసింహారావును చింతపల్లికి, రాజమండ్రి ఏపీఎస్ఎఫ్ఏ డీఎఫ్‌వో ఇ. హారికను సూళ్లూరుపేట వైల్డ్‌లైఫ్ డీఎఫ్‌వోగా, ఈస్ట్‌గోదావరి డీఎఫ్‌వో బి.నాగరాజును రాజమండ్రి ఏపీఎస్ఎఫ్ఏ డిప్యూటీ డైరెక్టర్‌గా పోస్టింగ్‌లు ఇచ్చారు.

సూర్యలంక హత్య కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టి కేసు వివరాలు వెల్లడిస్తున్న బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు

బాపట్ల రూరల్, సెప్టెంబరు 22: సూర్యలంక హత్య కేసులో నిందితుడిని బాపట్ల రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిని మీడియా ముందు ప్రవేశ పెట్టి కేసు వివరాలను బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు వెల్లడించారు. బాపట్ల పట్టణం హనుమంతరావుకాలనీ గత కొన్నేళ్లుగా నివాసం ఉంటున్న బి.ఏసుబాబు (45) ఫైనాన్స్‌కు డబ్బులు ఇస్తూ జీవనాన్ని కొనసాగించేవాడు. ఈనెల 16వ తేదీన అతని వద్ద పని చేసే కొక్కిలిగడ్డ చంద్రశేఖర్ డబ్బులు వసూల్ చేయటానికి మృతుడు ఏసుబాబును పిలవగా తన ద్విచక్రవాహనంపై ఆదర్శనగర్ వద్ద చంద్రశేఖర్‌ను ఎక్కించుకొని సూర్యలంక వెళ్తుండగా, మార్గమధ్యలో నిందితుడు చంద్రశేఖర్ ద్విచక్ర వాహనాన్ని చప్టా వద్ద ఆపమన్నాడు. డబ్బులు విషయంలో చంద్రశేఖర్ మృతుడు ఏసుబాబుతో గొడవపడి తన వెంట తెచ్చుకున్న కోడికత్తితో ఏసుబాబు మెడపై, శరీర భాగాల్లో పొడిచాడు. ఏసుబాబు అతని నుంచి తప్పించుకొని తన బండిపై సూర్యలంక గ్రామానికి చేరుకుని దోమ వెంకట్రావుకు చెందిన కిరణా షాపు వద్ద పడిపోయాడు. ఫైనాన్స్ డబ్బుల విషయంలో గొడవపడి తనని కొక్కిలిగడ్డ చంద్రశేఖర్ కత్తితో పొడిచినట్లు గోవర్ధన్ అనే వ్యక్తికి చెప్పి చనిపోయాడు. ఈ విషయంపై మృతుడి భార్య అములు ఫిర్యాదు మేరకు బాపట్ల రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 22న సూర్యలంక రోడ్డులోని పందెంకోడి రెస్టారెంట్ సమీపంలో రూరల్ సీఐ కె.గంగాధర్ సిబ్బందితో కలిసి నిందితుడిని అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు వేగవంతంగా నిర్వహించిన అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, డీఎస్పీ రామాంజనేయులు, రూరల్ సీఐ కె.గంగాధర్, పోలీసులను ఎస్పీ అభినందించారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య



శివగంగరాజు (ఫైల్ ఫొటో)

గురజాలటౌన్, సెప్టెంబరు 22: అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పులిపాడులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కన్నెబోయిన శివగంగరాజు (30) రెండేళ్లుగా ఏడు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి, మిర్చి సాగు చేశాడు. పంటల దిగుబడి సరిగా రాకపోవడంతో రూ.7 లక్షల దాకా అప్పులయ్యాయి. అప్పులు ఎలా తీర్చాలో అర్థంకాక మనస్తాపంతో శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



మృతుడు మేఘావత్ బాబులు నాయక్

బొల్లాపల్లి, సెప్టెంబరు 22: మండలంలోని కంప్రి గ్రామానికి చెందిన మేఘావత్ బాబులు నాయక్(55) విద్యుదాఘాతంలో ఆదివారం మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బాబులు నాయక్ తన మిర్చి పొలానికి నీరు పెట్టేందుకు విద్యుత్ మోటారు వద్దకు వెళ్లి కరెంటు తీగలు తగలటంతో విద్యుదాఘాతానికి గురై కింద పడి పోయాడు. చుట్టు పక్కల పొలాల వారు వచ్చి చూడగా అప్పటికే బాబులు నాయక్ మృతి చెందాడు. ఈ ఘటనపై బాబులు నాయక్ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎ.బాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాబులు నాయక్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పాముకాటుకు కూలీ మృతి

గురజాలటౌన్, సెప్టెంబరు 22: పాముకాటుకు కూలీ మృతి చెందిన సంఘటన గురజాల పట్టణంలో చోటుచేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గురజాల పట్టణానికి చెందిన సింగంపల్లి సోమయ్య (54) ఆదివారం కూలి పనుల నిమిత్తం గురజాల నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురంలో గడ్డి మూటలు ఎత్తడానికి వెళ్లాడు. గడ్డి మూటలు ఎత్తుతుండగా పాము కాటు వేసింది. తోటి కూలీలు అతడ్ని గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే సోమయ్య మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వరినారుకు భలే గిరాకీ



నారు తీస్తున్న కూలీలు

- దెబ్బతిన్న పొలాల్లో మళ్లీ నాటుకు రైతుల అవస్థలు

బాపట్ల, సెప్టెంబరు 22: అతివృష్టి, అనావృష్టి మధ్య అల్లాడుతున్న రైతుల ఆశలు చిగురించాయి. ఆగస్టు నెల చివరి నుంచి ఈ నెల మొదటి వారం వరకు కురిసిన భారీ వర్షాలతో, వరదనీటితో ముంపునకు గురైన పొలాల్లో పైరు, నారు కొంత కుళ్లిపోయింది. పంటను రక్షించుకునేందుకు నీటి మొత్తాన్ని రైతులు తొలగించారు. ఆ తర్వాత వేసవిని మించిన ఎండతీవ్రత రావటంతో పొలాల్లో ఉన్న పైరు ఎండుముఖం పట్టింది. కొంతమంది రైతులు అయితే పైరును గొర్రెల మేతకు వదిలేశారు. మరికొందరు ఇంజిన్లతో డ్రైయినేజిలో అడుగంటి ఉన్న నీటిని తోడుకొని రక్షించే ప్రయత్నం చేశారు. సముద్ర తీర ప్రాంత రైతులు ఆశలు వదులుకున్నారు.

సెంటు రూ.3 వేలు..

దీనికితోడు దెబ్బతిన్న పొలాల్లో మళ్లీ నాటు వేయటానికి గరువు మెరక భూముల్లో పెంచిన వరినారు కొని పొలంలోకి తీసుకురావాలంటే సెంటు రూ. 3 వేలు అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల సాగు వదిలేద్దామనుకున్న తరుణంలో శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం ఉదయం వరకు కురిసిన భారీవర్షంతో పొలాల్లో నీరు నిలిచింది. దీంతో నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల్లో చివరి భూముల్లో సైతం నీరు నిలిచి రైతు ఆశలు చిగురించాయి. కాల్వలకు కూడా గండ్లు పూడ్చి నీరు విడుదల చేయటంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. దీంతో మళ్లీ వరినారు కోసం పరుగులు తీస్తున్నారు. ధర ఎంతైనా కొనుగోలు చేస్తున్నారు.

అడ్వాన్స్ ఇచ్చి మరీ..

బాపట్ల మండలంలోని ధరివాద కొత్తపాలెం, కర్లపాలెం మండలంలోని నల్లమోతువారిపాలెం, నందాయపాలెం, ఎం.వి.రాజుపాలెం పరిసర ప్రాంతాల్లో ఒక దఫా నారు విక్రయించిన వారు మళ్లీ వెంటనే నారు పోశారు. 10 రోజుల క్రితం పోసిన నారు మరో 10 రోజుల్లో తీసుకెళ్తామని చెప్పి సెంటు రూ.1800 నుంచి రూ.2500 వరకు మాట్లాడుకుని అడ్వాన్స్ ఇచ్చి వెళ్తున్నారు. దీంతో మెరక భూముల్లో నారు పెంచే సన్న, చిన్నకారు రైతులకు లాభదాయకంగా మారింది. విత్తన రకాలను బట్టి నారు ధర పైపైకి వెళ్తుందని రైతులు పేర్కొంటున్నారు. బాపట్ల పరిసర ప్రాంతాల నుంచే కాకుండా పల్నాడు, గుంటూరు జిల్లాల నుంచి కూడా నారు కొనుగోలు చేసేందుకు రైతులు ఈ ప్రాంతానికి వస్తున్నారు.



నారు కొనుగోలు చేసి ట్రాక్టర్‌లో తెచ్చి దించుకుంటున్న రైతులు

దేవునికే ద్రోహం చేసిన జగన్‌కి ప్రజలు ఓ లెక్కా

వేమూరు, సెప్టెంబరు 22: తిరుమల వేంకటేశ్వరస్వామికి ద్రోహం చేసిన జగన్మోహన్‌రెడ్డికి ప్రజలు ఒక లెక్క అని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆదివారం చావలి కల్యాణ మండపంలో గ్రామ సర్పంచి, జనసేన నాయకులు విష్ణుమొలకల శ్రీనివాసరావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. వాలేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే తొలుత పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను గోడలపై ఆయన స్వయంగా అంటించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన తిరుపతి లడ్డూ ప్రసాదంలో, ఇతర ప్రసాదాలలో జంతు కొవ్వుతో తయారు చేసిన నూనె వాడి పవిత్రతను దెబ్బతీసిన జగన్‌రెడ్డికి వెంకటేశ్వర స్వామి గుణపాఠం చెప్పారన్నారు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని ప్రజలను నయవంచన చేసిన జగన్ వ్యవస్థలను భ్రష్టు పట్టించారన్నారు. 100 రోజుల పాలన కాలంలో 100 సంక్షేమ పథకాలు అమలుకు శ్రీకారం చుట్టి విజన్ 2047తో ముందుకు సాగుతున్నామని చెప్పారు. ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలాంటివన్నారు. దీపావళి పండగ నుంచి పేదలకు ఏడాదికి మూడు సిలిండర్లు అందిస్తామన్నారు. డ్వాక్రా మహిళలకు అందించే రుణాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామన్నారు. పంచాయతీల నిధులు రూ.12 వేల కోట్లు జగన్ దారి మళ్లిస్తే ఈ రోజు పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఉన్న పవన్ కల్యాణ్ రూ.12,500 కోట్లు నిధులు నేరుగా పంచాయతీల ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. భూ హక్కు చట్టాన్ని రద్దు చేయడం ద్వారా రైతుల భూములకు రక్షణ కల్పించినట్లు చెప్పారు. జగన్ రూ.60 వేల కోట్లకు పైగా ఇసుక దోపిడీ చేశారని, ఈ రోజు ఉచితంగా ఇసుకను సరఫరా చేస్తున్నట్లు వివరించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పాలన చంద్రబాబు నేతృత్వంలో పవన్ సహకారంతో ముందుకు నడుస్తుందన్నారు.



చావలి గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

క్రీడలు నాయకత్వాన్ని పెంపొందిస్తాయి

- శాప్ మాజీ చైర్మన్ అంకమ్మ చౌదరి
- ఏపీ స్టేట్ పికిల్ బాల్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అంకమ్మ చౌదరి, నిర్వాహకులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 22: క్రీడలు ఆరోగ్యంతోపాటు, నాయకత్వాన్ని పెంపొందిస్తాయని ఏపీ శాప్ మాజీ చైర్మన్ డాక్టర్ పి.అంకమ్మ చౌదరి అన్నారు. ఏపీ పికెల్ బాల్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక గుంటూరు, హనుమయ్య నగర్‌లో, వీవీవీ హెల్త్ హబ్‌లో ఆదివారం ఏపీ పికిల్ బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం అంకమ్మ చౌదరి మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో పికిల్ బాల్ క్రీడ బాగా ప్రాచుర్యం పొందిందని, మన దేశంలో కూడా ఇప్పుడు బాగా ప్రాచుర్యం చెందుతుందని తెలిపారు. ఏపీ పికిల్ బాల్ సంఘం కార్యదర్శి ఎన్.శ్రీధర్ మాట్లాడుతూ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలకు చెందిన క్రీడాకారులు హాజరైయ్యారని అన్నారు. అండర్-14, ఓపెన్, 35 ప్లస్, 50 ప్లస్ పురుషులు, మహిళల విభాగంలో సింగిల్స్, డబల్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ఈ కోర్టులు నిర్మాణం చేపట్టాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వీవీవీ హెల్త్ హబ్ డైరెక్టర్ టి. అరుణ్ కుమార్, అమ్మయ్య, టెన్నిస్ కోచ్ జీవీఎస్ ప్రసాదు, ఆనంద్ కుమార్, నాగరాజు, సుష్మ, స్వప్న, భరత్, వలి తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన తెలంగాణ ఎడ్లు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న తాడికొండ ఎమ్మెల్యే. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్ కుమార్

ప్రత్తిపాడు, సెప్టెంబరు 22: జాతీయ స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు ప్రత్తిపాడులో రసవత్తరంగా సాగుతున్నాయి. గత వారం రోజులుగా వివిధ విభాగాలలో పోటీలు జరిగాయి. ఆదివారం జూనియర్స్ విభాగంలో నిర్వహించిన పోటీలలో పది జతలు పాల్గొన్నాయి. ఇందులో హైదరాబాదుకు చెందిన డి.రోహన్ బాబు ఎడ్ల జత 2523.3 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం, బురుజుపల్లి గ్రామానికి చెందిన యరమల మోక్ష అదరన్ రెడ్డి, గుంటూరుకు చెందిన సోమిశెట్టి ఆంజనేయులుల ఎడ్ల జత 2481.4 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానంలో నిలిచింది. హైదరాబాదుకు చెందిన రోహన్‌బాబు ఎడ్ల జత 2408.1 అడుగుల దూరం లాగి మూడో స్థానంలో, బాపట్ల జిల్లా చుండూరు మండలం, వేటపాలెంకు చెందిన అత్తోట శిరీష, శివకృష్ణ చౌదరిలకు చెందిన ఎడ్ల జత 2408.1 అడుగుల దూరం లాగి మూడో స్థానంలో నిలిచాయి. వీరి మరో జత 2400 అడుగుల దూరం లాగి నాలుగో స్థానంలో, కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం నాదెళ్లవారిపాలెం గ్రామానికి చెందిన కాకర్ల సురేష్ బాబు ఎడ్ల 2100 అడుగుల దూరం లాగి ఐదో స్థానంలో, పెదనందిపాడు మండలం నాగులపాడుకు చెందిన ఆళ్ల మోహనరావు, గొల్లపూడి కోటయ్య చౌదరిలకు చెందిన ఎడ్ల జత 1894.6 అడుగుల దూరం లాగి ఆరో స్థానంలో, పల్నాడు జిల్లా రెంటచింతల మండలం, రెంటాలకు చెందిన పిన్నెబోయిన సూర్య అషివిక్ యాదవ్‌కు చెందిన ఎఉద్దుల 1506.6 అడుగుల దూరం లాగి 7వ స్థానంలో నిలిచింది. గెలిచిన అభ్యర్థులకు తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో దేశం నాయకులు గింజుపల్లి వెంకటేశ్వరరావు, శివరామప్రసాద్, కుర్రి సుబ్బారెడ్డి, భాగ్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీఎన్ కాలనీలో మరో భారీ చోరీ

- 50 సవర్లకుపైగా బంగారు ఆభరణాలు అపహరణ



చోరీ జరిగిన తీరును పరిశీలిస్తున్న పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబు

గుంటూరు, సెప్టెంబరు 22: ఎస్వీఎన్ కాలనీ వాసులు వాసులు ఉలిక్కిపడ్డారు. పట్టపగలు తాళం వేసిన ఇంటిలో భారీ చోరీకి పాల్పడిన కొద్దిగంటల వ్యవధిలోనే అదే ప్రాంతంలో మరో భారీ చోరీ జరగడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వృద్ధ దంపతులు ఇంటిలో నిద్రిస్తుండగానే దొంగలు బీరువాలోని 50 సవర్లకుపైగా బంగారు ఆభరణాలు అపహరించుకుపోవడం స్థానికులను కలవరానికి గురిచేసింది. మహాలక్ష్మి బార్ పక్క సందులో నుంచి ఎస్వీఎన్ కాలనీవైపు వస్తుండగా ఎడమ వైపున ఉన్న ఎస్వీఎన్ కాలనీలోని బాంబే డయింగ్ కాలనీలో శనివారం అర్ధరాత్రి ఈ చోరీ జరిగింది. బాధితులు, పట్టాభిపురం పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బాధితుడు సూర్యనారాయణ తపాలా శాఖలో పని చేసి ఉద్యోగ విరమణ చేశారు. వారి పిల్లలు అమెరికాలో స్థిరపడగా సూర్యనారాయణ దంపతులు ఇరువురు స్థానికంగా నివాసం ఉంటున్నారు. శనివారం రాత్రి రోజు మాదిరిగానే సూర్యనారాయణ దంపతులు హాలులో నిద్రించారు. తెల్లవారిన తర్వాత చూడగా బీరువా తెరిచి అందులో ఉన్న 50 సవర్లకు పైగా బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు గుర్తించారు. శనివారం అర్ధరాత్రి సమయంలో దొంగలు బెడ్ రూమ్ కిటికీ బోల్టులు తీసి లోనికి ప్రవేశించారు. అందుబాటులో ఉన్న తాళం చెవులతో బీరువా తెరిచి అందులో ఉన్న సుమారు 50 సవర్లకు పైగా బంగారు ఆభరణాలను అపహరించుకుపోయారు. బాధితుడు సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబు, ఎస్ఐ మధు పవన్, సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. సీసీఎస్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

గంటల వ్యవధిలోనే ఒకే ప్రాంతంలో..

స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్వీఎన్ కాలనీలో ఒకే ప్రాంతంలో కొద్ది గంటల వ్యవధిలోనే రెండు భారీ చోరీలు జరగడం పట్ల స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఎస్వీఎన్ కాలనీ ఏడో లైనులో శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల మధ్య తాళం వేసి ఉన్న ఇంటిలో భారీ చోరీ జరిగిన విషయం విదితమే. ఎస్వీఎన్ కాలనీ వాసుల్లో వరుసగా కొద్ది గంటల వ్యవధిలో రెండు దొంగతనాలు జరగడంతో వారిని ఆందోళనకు గురిచేసింది. రెండు ఘటనల్లోనూ బాధితులు దొంగల చేతికి తాళాలు ఇచ్చినట్లయింది. దగ్గరలో ఉన్న సీసీ కెమెరాలో పరిశీలించినా ఎటువంటి ఆనవాళ్లు కనిపించలేదు.

ఆదిత్య ఇన్‌ఫ్రా ఎన్వోసిని రద్దు చేసిన రైల్వే శాఖ

- ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 22: గతంలో గుంటూరు పట్టణంలో ఆదిత్య ఇన్‌ఫ్రా అపార్టుమెంట్ పేరుతో ఇచ్చిన ఎన్వోసిని రైల్వే శాఖ రద్దు చేసిందని పొన్నూరు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆదివారం తెలిపారు. రైల్వే శాఖ రద్దు చేసిన ఎన్వోసిని గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్ నిర్మాణానికి వినియోగించుకుంటున్నారని ఆరోపించారు. నిబంధనలను ఉల్లంఘించటం వల్లనే రైల్వే శాఖ ఎన్వోసిని రద్దు చేసిందన్నారు. కానీ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. రైల్వే శాఖ రద్దు చేసిన ఎన్వోసి విషయాన్ని గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు తెలియజేసింది వాస్తవం కాదా అన్ని ప్రశ్నించారు. 2023 మే 25న క్యాన్సిలేషన్ కాపీని రైల్వే శాఖ కార్పొరేషన్‌కు పంపితే ఆ నాటి నుంచి నిర్మాణాలను నిలుపుదల చేయకుండా ఎందుకు కొనసాగిస్తున్నారని కార్పొరేషన్ అధికారులను నిలదీశారు. ఎన్వోసి రద్దు ఉత్తర్వులను కార్పొరేషన్ అధికారులు దాచి పెట్టడానికి గల కారణాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘనతో జులైలోనే స్టాప్ వర్క్ ఆర్డర్లు ఇచ్చినప్పటికీ ఎందుకు బహిర్గత పర్చలేదని ప్రశ్నించారు. స్టాప్ వర్క్ ఆర్డర్లు ఉన్నా బజరంగ్ అర్బన్ ఇన్‌ఫ్రా పనులు చేపట్టడం వల్లనే పక్కనే ఉన్న నిర్మాణాలు దెబ్బతిన్నాయని ఆరోపించారు. బజరంగ్ అర్బన్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ వారితో కుమ్మక్కైన అధికారులపై కూడా విచారణలు జరపాలని డిమాండ్ చేశారు. 35 ఏళ్ల అనుభవం ఉందని చెబుతున్న అంబటి మురళి చట్టబద్ధంగా ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్మాణాలు ఎలా కొనసాగించారని ప్రశ్నించారు. ఆదిత్య ఇన్‌ఫ్రా కంపెనీ, బజరంగ్ ఇన్‌ఫ్రా రెండు సంస్థల అనుమతుల్లో తేడాలు లేవా అన్ని ప్రశ్నించారు. తప్పుడు ధ్రువ పత్రాలు దాఖలు చేసి అనుమతులను అక్రమంగా బదిలీ చేసుకున్నారని ఆరోపించారు. ఇటీవల కార్పొరేషన్ అధికారులు విడుదల చేసిన గ్రౌండ్ పరిశీలన నివేదికలో కూడా రైల్వే శాఖ రద్దు చేసిన ఎన్వోసి గురించి తెలపకపోవటంలో అంతర్యం ఏంటని ప్రశ్నించారు. తక్షణమే సంబంధిత అధికారులపై కూడా విచారణ జరపాలని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ డిమాండ్ చేశారు.

మూడు జిల్లాలకు కాంగ్రెస్ ఇంఛార్జిల నియామకం

గుంటూరు, సెప్టెంబరు 22: నూతన కమిటీల నియామకం చేపట్టిన ఏపీసీసీ తాజాగా జిల్లాలకు కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జిలను నియమించింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని మూడు జిల్లాలకు కొత్త ఇంఛార్జిలను నియమిస్తూ ఏపీసీసీ అధ్యక్షులు వైఎస్ షర్మిల ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు జిల్లా కాంగ్రెస్ ఇంఛార్జిగా ఒంగోలుకు చెందిన శ్రీపతి ప్రకాశంను నియమించారు. ఆయన ఏపీసీసీ ఉపాధ్యక్షుడుగా వ్యవహరిస్తున్నారు. ఏపీసీసీ ప్రధాన కార్యదర్శులుగా వ్యవహరిస్తున్న జిల్లాకు చెందిన మదన మోహన్‌రెడ్డిని పల్నాడు జిల్లా ఇంఛార్జిగా, గడ్డం పాల్ విజయ్‌కుమార్‌ను బాపట్ల జిల్లా ఇంఛార్జిగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

26 నుంచి స్కూల్ ఫెడరేషన్ ఎంపికలు

గుంటూరు(విద్య), సెప్టెంబరు 22: ఉమ్మడి గుంటూరు జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2024 - 25 సంవత్సరానికి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు డీఈవో పి.శైలజ, కార్యదర్శి మెల్లంపూడి రవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న సెపక్ తక్రా అండర్-14, అండర్-17 బాల బాలికల ఎంపికలు సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తారు. అదే రోజు బాల్ బ్యాడ్మింటన్ అండర్-14, అండర్-17 (బాలికలు మాత్రమే) ఎంపికలు శావల్యాపురంలో నిర్వహిస్తారని తెలిపారు. ఈ నెల 27న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నంబూరులో అండర్-14, అండర్-17 బాల బాలికల అథెటిక్స్ ఎంపికలు నిర్వహిస్తారని తెలిపారు.

జనసేనలోకి వైసీపీ నేత చందు సాంబశివరావు?



మంత్రి మనోహర్‌ను కలసి పుష్పగుచ్ఛం అందిస్తున్న చందు సాంబశివరావు

తెనాలి, సెప్టెంబరు 22, (ఆంధ్రజ్యోతి): వైసీపీ నుంచి మరో నేత జనసేనలోకి చేరే ప్రయత్నాల్లో ఉన్నారు. అంతరిక్ష శాస్త్రవేత్త, వైసీపీ నాయకుడు డాక్టర్ చందు సాంబశివరావు ఆ పార్టీని వీడి జనసేనలోకి చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్టు సమాచారం. ఈమేరకు ఆదివారం రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్‌ను తెనాలిలో కలిశారు. ఇప్పటికే సామినేని ఉదయభాను, బాలినేని శ్రీనివాసరెడ్డి, కిలారు రోశయ్య వైసీపీని వదిలి జనసేనలోకి చేరుతున్నట్టు తేలిపోయింది. వీరితో సన్నిహితంగా ఉండే సాంబశివరావు కూడా మనోహర్‌ను కలవటంతో వైసీపీని వీడుతున్న నేతలు వరుస కట్టినట్టయింది. సాంబశివరావు చాలా కాలం టీడీపీలో పనిచేశారు. తర్వాత బీజేపీలో చేరి, మొన్నటి ఎన్నికలకు ముందు వైసీపీలో చేరారు.

సైనేడ్ నిందితులపై మరో కేసు నమోదు

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 22: ఆస్తులు, బంగారం, అప్పును ఎగ్గొట్టడానికి కూల్‌డ్రింక్స్‌లో, ఆహారంలో సైనేడ్ కలిపి వరుస హత్యలు చేయడం పట్టణంలో కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. స్థానిక యడ్లలింగయ్య కాలనీకి చెందిన వెంకటేశ్వరి అలియాస్ బుజ్జి, మునగప్ప, రజనీ, రమణమ్మలు సైనేడ్‌తో పలువురిని హత్యచేసి ఇటీవల అరెస్టై రిమాండ్‌లో ఉన్న సంగది తెలిసిందే. చెంచుపేటకు చెందిన వాలెంటీర్ అన్నపూర్ణ రెండేళ్ల క్రితం 2022 డిసెంబర్ 26న తన ఇంటిలో 20 గ్రాముల బంగారు గొలుసును వెంకటేశ్వరి అలియాస్ బుజ్జి దొంగిలించిందనీ, తనను కూడా సైనేడ్‌తో చంపాలని తన భోజనం బాక్స్‌లో సైనేడ్ కల్పిందని తెలిపింది. కలర్ మారిన భోజనాన్ని తినకపోవడంతో బతికిపోయానంది. వీరు చేసిన హత్యల గురించి ఇటీవల తెలుసుకోవడంతో తన గొలుసును వెంకటేశ్వరి దొంగిలించిందని, తనను చంపాలని ప్రత్నించిందనే అనుమానంతో పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు త్రీటౌన్ ఎస్సై ప్రకాశరావు తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

తెనాలి క్రైం, సెప్టెంబరు 22 : స్థానిక నాజరుపేటకు చెందిన వివాహిత జారిపడి గాయాలపాలు కావడంతో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు కొల్లిపర మండలం సిరిపురంకు చెందిన అత్తోట వసంతలక్ష్మి (33) మొదటి భర్తతో విభేదాలు రావడంతో ఏడాది క్రితం కరీమ్ వృధ్వీని రెండో వివాహం చేసుకుని నాజరుపేటలో నివాసం ఉంటున్నారు. ఈమెకు మొదటి వివాహం వలన ఇద్దరు మగ పిల్లలు, రెండో వివాహం వలన ఆగస్టు 29న మరో మగ పిల్లవాడికి జన్మనిచ్చింది. వారం రోజుల క్రితం బాత్‌రూమ్‌లో జారిపడి గాయాలవ్వడం భర్త కరీమ్ వృధ్వీ ఆమెను గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకి తరలించి చికిత్స అందిస్తున్నాడు. శనివారం ఆమె ఆరోగ్యం విషమించి మృతి చెందింది. దీనిపై మృతురాలు, కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్పృహ కోల్పోయి మరొకరు..

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 22: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణంలో చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. ఆదివారం త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మార్కెట్ సెంటర్‌లోని కొత్త వంతెనపై పనుల నిమిత్తం వెళ్తున్న వ్యక్తి స్పృహ కోల్పోయాడన్నారు. అదే సమయంలో అక్కడ విధి నిర్వహణలో ఉన్న డీఎస్పీ జనార్దనరావు, సీఐ రమేష్‌బాబు గమనించి ఆ వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆటోలో జిల్లా వైద్యశాలకు తరలించారన్నారు. చికిత్స పొందుతూ ఆ వ్యక్తి మృతి చెందాడని తెలిపారు. మృతి చెందిన వ్యక్తి పేరు విజయ కుమార్ అని అతనికి ఎవరూ లేరని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్టు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, సెప్టెంబరు 22: నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం ఆదివారం నాటికి 589.30 అడుగులు ఉంది. ఇది 309.95 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,350 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 2,926 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 28,501 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 44,177 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 46,177 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 22 : పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 33,847 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 36,963 క్యూసెక్కుల నీరు ఒక గేటు ద్వారా దిగువ కృష్ణకు విడుదల అవుతుంది. వీటిలో 16వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా దిగువకు విడుదల అవుతున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	123, 132,142
చికెన్ విత్ స్కిన్	230.00
చికెన్ స్కిన్ లెస్	240.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



అధికారులతో కలిసి సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ జె.వెంకటమురళి

పక్కాగా ముంపు కుటుంబాల సర్వే

● కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, సెప్టెంబరు 22 : ఇటీవల కురిసిన భారీవర్షాలు, వరద విపత్తులకు జలదిగ్బంధంలో చిక్కుకున్న కుటుంబాలన్నిటిని పక్కాగా సర్వే చేశామని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. వరద విపత్తుకు గురైన జిల్లాల కలెక్టర్‌లతో రాష్ట్ర రెవెన్యూ శాఖ విపత్తుల నిర్వహణ ప్రాధికార సంస్థ స్పెషల్ చీఫ్ సెక్రటరి ఆర్‌పి సిసోడియా ఆదివారం వీక్షణ సమావేశం నిర్వహించారు. జిల్లాలో జరిగిన నష్టం, పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సచివాలయాల వద్ద అర్హుల జాబితా నోటీసు బోర్డులో ప్రచురించాలన్నారు. సర్వేలో నమోదుకాని వారు తమ సమస్యలపై ఫిర్యాదులు చేసుకోవటానికి సచివాలయాలలో లాగిన్ ఇస్తామని చెప్పారు. కృష్ణా నది పరివాహక ప్రాంతమైన బాపట్ల జిల్లాలోని 24 లంక గ్రామాల ప్రజలకు పూర్తిగా నష్టం వాటిల్లిందని కలెక్టర్ వెంకటమురళి వివరించారు. ఆ గ్రామాలన్నీ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయని, తదుపరి సహాయక చర్యలు చేపట్టామని తెలియజేశారు. సర్వే బృందాలు క్షేత్ర స్థాయిలో పర్యటించి పక్కాగా సర్వే నిర్వహించాయన్నారు. 499 మంది లబ్ధిదారుల ఈకేవైసీ ప్రక్రియ మిగిలిపోయిందన్నారు. సాంకేతిక సమస్యలు తలెత్తటంతో 200 మంది వివరాలు సర్వే యాప్‌లోనే సూపర్‌వైజర్ లాగిన్‌లో ఉండిపోయాయని చెప్పారు. మరో 250 మంది వివరాలకు సర్వే చేసిన వారి ఐడి నెంబరు చూపటంలేదన్నారు. 490 చిన్న సమస్యలు తలెత్తాయని వాటి పరిష్కారానికి అనుమతిఇవ్వాలన్నారు. వరద నష్టపరిహారానికి అర్హులైన వారి జాబితా సచివాలయాల వద్ద ప్రకటిస్తామన్నారు. సామాజిక తనిఖీ ప్రక్రియ జరుగుతుందన్నారు. ప్రజలు ఎవరైనా ఆన్‌లైన్‌లో తమ పేర్లు చూసుకోవటానికి పబ్లిక్ డొమైన్‌లో వివరాలను నిక్షిప్తం చేస్తామన్నారు. సమావేశంలో జేసీ ప్రఖర్‌జైన్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, జలవనరులు, వ్యవసాయ, మత్స్యశాఖాధికారులు మల్లికార్జున, రామకృష్ణ, సురేష్ పాల్గొన్నారు.

శ్రీబగళాముఖిని దర్శించుకున్న బాపట్ల మున్సిపల్ కమిషనర్

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 22 : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి ఆలయానికి బాపట్ల మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ కుటుంబ సమేతంగా విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. శ్రీబగళాముఖి అమ్మవారి ఆలయ విశేషాలను తెలుసుకొని రానున్న రోజుల్లో అమ్మవారి కార్యక్రమాలలో తనవంతు సహాయ సహకారాలను అందజేస్తానని తెలిపారు. కమిషనర్ కుటుంబ సభ్యులకు ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనాలు, అమ్మవారి చిత్రపటాలను అందజేసి, దుశ్శాలువాలతో సత్కరించి వారికి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త నెమలికంటి హనుమంతరావు, ఆలయ అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే శ్రీబగళాముఖి అమ్మవారిని ఆదివారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.



కమిషనర్ నిర్మల్‌కుమార్ దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి

నేడు బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎన్‌సీసీ సెలక్షన్స్

బాపట్ల రూరల్, సెప్టెంబరు 22 : బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈనెల 23న 22(ఎ) బెటాలియన్ పరిధిలో ఎన్‌సీసీ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.ఆంజనేయులు తెలిపారు. ఆయన కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో చదువుకునే విద్యార్థులు ఎన్‌సీసీ సెలక్షన్స్‌కు హాజరుకావాలన్నారు. సోమవారం ఉదయం 9.30కు కళాశాలలోని క్రీడా మైదానంలో ఆయా కళాశాలల గుర్తింపు కార్డులతో విద్యార్థులు పాల్గొనాలన్నారు.

ఎరువుల దుకాణంలో తనిఖీలు



స్టాక్ రికార్డులను పరిశీలిస్తున్న ఏవో సుమంత్‌కుమార్

కర్లపాలెం,సెప్టెంబరు 22 : మండలంలో ఎరువుల దుకాణాలు నిర్వహించే లైసెన్స్ కలిగిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా ఎరువులను విక్రయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సుమంత్ కుమార్ ఎరువుల దుకాణాల యజమానులకు సూచించారు. కలెక్టర్ కె.వెంకటమురళి, జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ ఆదేశాల మేరకు కర్లపాలెంలోని ఎరువుల దుకాణాలను ఏవో సుమంత్‌కుమార్ ఆదివారం తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఎంఆర్‌పీ కన్న అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేయటమేకాకుండా కఠిన చర్యలు చేపడతామని ఏవో అన్నారు. ఎరువులను బ్లాక్ చేయకుండా రైతులకు అందుబాటులో ఉంచాలని, అక్రమ నిల్వలు ఉంచి అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు చేపడతామన్నారు. ఈపీవోఎస్ మిషన్‌లో రోజువారి అమ్మకాలను అప్‌డేట్ చేయాలన్నారు. స్టాక్‌బోర్డు కూడా ప్రతిరోజు ప్రదర్శన ఉంచాలన్నారు.

దళిత ఉద్యోగిపై దాడి చేసిన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

● దళిత బహుజన ప్రజాసంఘాల డిమాండ్

బాపట్ల, సెప్టెంబరు 22 : దళిత ఉద్యోగిపై దాడి చేసిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫ్లెక్సీని చించివేసిన ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజును భర్తరఫ్ చేయాలని దళిత బహుజన ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేల వైఖరిని నిరసిస్తూ ఆదివారం బాపట్ల అంబేద్కర్ సర్కిల్‌లో ఆందోళన చేశారు. దళితులను అవమానించిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. దీనిపై కూటమి ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి గుదే రాజారావు, దళిత ఐక్యవేదిక కన్వీనర్ తురిమెళ్ళ అమ్మేశ్వరరావు, బడుగు భరత్, వి.సి.కె. పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగుల గడ్డ చంద్రశేఖరరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి సలగల చంటిబాబు, డీపీఎఫ్ కన్వీనర్ దారా బాబురావు, బడుగు కిషోర్, ఏపూరి జోసఫ్, మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి శీలం రోజస్‌బాబు, తమలపాకుల ఆదాం, తుపాకుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలియజేస్తున్న బహుజన సమాజ్‌పార్టీ, దళిత సంఘాల నాయకులు

సర్వేయర్లు బదిలీ

బాపట్లరూరల్, సెప్టెంబరు 22 : బాపట్ల మండల సర్వేయర్‌గా పిట్టలవానిపాలెం మండలంలో విధులు నిర్వహిస్తున్న లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. అదేవిధంగా బాపట్ల మండల సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న మాధవి బాపట్ల పట్టణ సర్వేయర్‌గా, బాపట్ల పట్టణ సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు వేటపాలేనికి బదిలీ అయ్యారు. పిట్టలవానిపాలెం సర్వేయర్‌గా రామచంద్రరావు నియమితులయ్యారు.

మురుగునీటి మధ్య యానాదుల జీవనం

● 25 రోజులుగా జలదిగ్బంధంతో ఇబ్బందులు

● ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి



రాజీవ్‌గాంధీకాలనీలో యానాదుల పాకల చుట్టూ నిలిచి ఉన్న మురుగునీరు

బాపట్ల, సెప్టెంబరు 22 : భారీవర్షాలు, వరదనీటి వల్ల మురికివాడలలోని ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. బాపట్ల పట్టణంలోని 3వ వార్డు రాజీవ్‌గాంధీ కాలనీలో పూరిపాకలు వేసుకొని నివాసం ఉంటున్న యానాదుల కుటుంబాలు చుట్టూ వర్షపు నీరు చేరింది. దీనికితోడు మురుగు కాల్వలో నీరు పొంగి ఈ ప్రాంతానికి చేరుకుంది. అదేవిధంగా చుట్టుపక్కల ఉన్న ఖాళీ స్థలాలలో నీరు నిలిచి తటాకాలను తలపిస్తున్నాయి. దుర్గంధపూరితమైన ఈ ప్రాంతాలలో పందులు స్వైరవిహారం చేయటం పరిపాటిగా మారింది. ఈ ప్రాంతంలో నీరు మాత్రం బయటకెళ్ళే పరిస్థితి కనిపించటంలేదు. దోమలవ్యాప్తి అధికమవ్వటంతోపాటు నీరు నిలవటం వల్ల విషపురుగులు పాకలలోకి వస్తున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు వర్షం వచ్చినప్పుడు కనిపించారేతప్ప ఆ తర్వాత తమను ఎవరూ పలకరించలేదని బాధితులు అన్నారు. 25 రోజులుగా ఈ ప్రాంతంలో సమస్య నెలకొని ఉంది. అయినప్పటికీ అధికారులు స్పందించటంలేదు. ఇప్పటికే అనేకమంది విషజ్వరాల బారీనపడుతున్నారు. అదేవిధంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో చెత్తాచెదారం డంప్ చేసి వదిలేస్తున్నారు. దీనివల్ల దుర్గంధం వెదజల్లుతున్నది. ఎప్పటికప్పుడు చెత్తనిల్వలను డంపింగ్ యార్డుకు తరలించాలని ఆయాప్రాంత ప్రజలు కోరుతున్నారు. మురుగునీటిని బయటకు పంపించి పందులు సంచరించకుండా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

చంద్రబాబు హామీని పట్టించుకోని అధికారులు

ఎన్నికలకు ముందు మిచౌంగ్ తుఫాన్ సమయంలో వరద బాధితులను పరామర్శించేందుకు వచ్చిన చంద్రబాబునాయుడు బాపట్ల పట్టణంలోని 3వవార్డు రాజీవ్‌గాంధీకాలనీలోని ఎస్టీ కుటుంబాలవారి దీనగాధను స్వయంగా పరిశీలించి తెలుసుకున్నారు. అందరికి మౌలిక వసతులు కల్పించటంతోపాటు పక్కా గృహాలు నిర్మిస్తామని ప్రకటించారు. ప్రభుత్వం రాగానే తమజీవితాలలో వెలుగులు వస్తాయని ఆశించిన యానాదుల కుటుంబాలు ఆశతో ఎదురు చూస్తున్నాయి. అయినప్పటికి ఎప్పటిలాగే మురుగునీటిలో నివాసాలు దయనీయమైన జీవితాలతో అల్లాడిపోతున్నారు. పాలకులు, అధికారులు నేటి వరకు కన్నెత్తి చూడకపోవటం అనేక విమర్శలకు ఊతమిస్తున్నది. ముఖ్యంగా స్వచ్ఛతాహీ సేవ అంటూ వార్డులలో పర్యటించే అధికారులు, కార్మికులు కేవలం ప్రధాన వీధులు, ముఖ్య కూడళ్ళల్లో మాత్రమే శుభ్రం చేస్తూ మురికివాడలవైపు కన్నెత్తి చూడటంలేదు. ఈ ప్రాంతంలో చెత్త తొలిగించి 25 రోజులు కావటం గమనార్హం. ప్రభుత్వ ఆశయాలను, విధానాలను నీరుగార్చే విధంగా వ్యవహరిస్తున్న మున్సిపల్ అధికారుల పనితీరుపై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆప్రాంత ప్రజలు కోరుతున్నారు.



3వ వార్డులోని యానాదుల పాకల వద్ద నిలిచిన నీరు



ఖాళీ స్థలాలలో నిలిచిన నీటిలో సంచరిస్తున్న పందులు

వరద బాధితులకు దుప్పట్లు, నిత్యావసరాల పంపిణీ

రేపల్లె, సెప్టెంబరు 22 : ఇటీవల వరద కారణంగా నష్టపోవటంతో వారికి అండగా నిలవాలని తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని కళాశాల కరస్పాండెంట్ కె.అవర్ధ అన్నారు. మండలంలోని పెనుమూడి పల్లెపాలెంలో వరద బాధితులకు రామకృష్ణ ఇంగ్లీషమీడియం హైస్కూల్ ఆధ్వర్యంలో 160 కుటుంబాలకు ఆదివారం దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు కొక్కిలిగడ్డ ధనుంజయరావు, ఉప్పాల శ్రీనివాసరావు, కళాశాల సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న రామకృష్ణ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం



బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న డీబీఆర్‌సీ ప్రతినిధి దేవకుమార్

వరద బాధితులకు నిత్యావసర సరుకులతో పాటు ఇంటిపై కప్పుకునే ప్లాస్టిక్ పట్టాలు, బక్కెట్లు ఆదివారం అందజేశారు. దేవకుమార్ మాట్లాడుతూ, డీబీఆర్‌సీ ఆధ్వర్యంలో గత 30 ఏళ్లుగా దళిత, గిరిజన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. వరద ప్రభావిత గ్రామాల్లో తమ వంతు సహాయ సహకారాలు అందించి బాధితులను ఆదుకోవాలనే సంకల్పంతో ముందుకు వచ్చి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణమోహన్, డీబీఆర్‌సీ ప్రతినిధులు నాగలక్ష్మి, రవితేజ, శ్రీలత, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

276 కుటుంబాలకు దోమతెరలు, దుప్పట్లు...

కొల్లూరు, సెప్టెంబరు 22 : 276 వరద బాధిత కుటుంబాలకు దోమతెరలు, దుప్పట్లు తదితర వస్తువులను పంపిణీ చేశారు. తెనాలి మండలంలోని అంగలకుదురు ముక్తి ట్రైబల్ స్కూల్ సహకారంతో ఫాదర్ జయపాల్, రెడ్‌క్రాస్ ప్రతినిధి ముమ్మనేని భానుమతి ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు అందజేశారు. ఫాదర్ బిబిన్, సిస్టర్స్ లీనా, ఇంగేషెన్, నవీన్, శ్రీమన్నారాయణ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.



తడికలపూడిలో వరద బాధితులకు దోమతెరలు, దుప్పట్లు, వస్తువులు అందజేస్తున్న దాతలు

450 కుటుంబాలకు నిత్యావసర సరుకులు...

కొల్లూరు, సెప్టెంబరు 22 : మూడు గ్రామాల్లోని 450 కుటుంబాలకు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి అల్లాడి దేవకుమార్ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మండల పరిధిలోని తోకలవానిపాలెం, రావిలంక, చిలుమూరులంక గ్రామాల్లోని

మత్స్యకార కుటుంబాలకు బియ్యం...

కొల్లూరు, సెప్టెంబరు 22 : మత్స్యకార కుటుంబాలకు మాజీ సర్పంచ్ యార్లగడ్డ శ్రీనివాసరావు (బుజ్జి) బియ్యం పంపిణీ చేశారు. మండల పరిధిలోని జువ్వలపాలెం గ్రామానికి చెందిన మత్స్యకార కుటుంబాలు ఇటీవల భారీ వరదకు జీవనోపాధి కోల్పోయాయి. స్థానిక శాసన సభ్యులు నక్కా ఆనందబాబు ఆదేశం మేరకు టీడీపీ నాయకులు మైనేని మురళీకృష్ణ సహాయ సహకారాలతో ఒక్కో మత్స్యకార కుటుంబానికి 25 కిలోల బియ్యాన్ని మాజీ సర్పంచ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మత్స్యకార కుటుంబాలకు బియ్యం పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు



గరువుపాలెంలో బాధితులకు ఆర్థికసాయం అందిస్తున్న తెలుగు యువత అధ్యక్షుడు రాము

బాధితులకు ఆర్థిక సాయం

రేపల్లె, సెప్టెంబరు 22 : ఇటీవల అనారోగ్యానికి గురైన నిజాంపట్నం మండలం కూచినపూడి పంచాయతీ యేమినేనివారిపాలెం పుల్లమెరక, గరువుపాలెం, కూచినపూడి గ్రామాల కు చెందిన యేమినేని హరిశంకర్, రేపూరి ఆనందరావు, మోర్ల యానాది, బొర్రా అంకమ్మ, సాంబశివరావు, వీరంకి వెంకటసుబ్బమ్మ, కొలసాని నాంచారమ్మ కుటుంబాలకు మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాలతో ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు రాము, టీడీపీ నాయకులు నల్లపాటి యల్లయ్య, జీ.రామారావు, బొర్రా సూర్యరాజు, చంద్రమౌళి, ఇంకొల్లు ఉమా, టి.దుర్గా, బెల్లంకొండ చిరంజీవి, మోర్ల కొండలు, గాదె అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన టీడీపీ, జనసేన నాయకులు



మొక్కలు నాటుతున్న సర్పంచ్ అంకమ్మ, అంకిరెడ్డి రవి

కర్లపాలెం,సెప్టెంబరు 22 : కర్లపాలెం మండలం గణపవరం గ్రామంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం జనసేన పార్టీ మండల అధ్యక్షుడు గొట్టిపాటి శ్రీకృష్ణ, టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు ఇనగంటి సునీత ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ దేవరకొండ అంకమ్మ, ఉప సర్పంచ్ అంకిరెడ్డి శ్రీవిద్య, రవికుమార్, మహేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బాపట్లలో ఆటో యూనియన్ పాయింట్‌లు ఏర్పాటు

బాపట్ల,సెప్టెంబరు 22 : పట్టణంలో కార్మిక శక్తి ఆటో యూనియన్ పాయింట్లను ఆదివారం ప్రారంభించారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు జి.పూర్ణచంద్రరావు, అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తదితరులు కలిసి కంకటపాలెం, చెరుకూరు పాయింట్‌లలో బోర్డులు ఏర్పాటు చేసి వాటిని ప్రారంభించారు. కార్మికులంతా ఐక్యంగా ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడుపుకొని జీవనోపాధి మెరుగుపర్చుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డేవిడ్, రత్నపాల్, మణి పాల్గొన్నారు.

మట్టి ఖర్చులకు ఆర్థికసాయం

కర్లపాలెం, సెప్టెంబరు 22 : మండలంలోని పేరలి పంచాయతీ గౌడపాలేనికి చెందిన ఈపూరు రాజమ్మ మృతి చెందగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5 వేల నగదును పేరలి నరసయ్య తిమ్మరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ పేరలి బాలకృష్ణమూర్తి సహకారంతో ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపూరి భూపతిరావు, గేరా ఏసుబాబు, కాగిత విజయరాజు, రాజ, ఎం.బుల్లియ్య, జోగి రాజేష్, దాసరి రత్నరాజు, జోగి సురేష్, షేక్ జానీ బాషా, షేక్ సుభానీ, జోగి ఇస్రాయిల్, ఈపూరి శ్రీను, బి.అంకమ్మ, ఎం.రవి, ఎం.విక్టర్ పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 22 : మండలపరిధిలోని ఖాజీపాలెం గ్రామపంచాయతీ పరిధిలో పేకాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.3,650 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చందోలు ఎస్‌ఐ ఆర్.స్వామి శ్రీనివాస్ తెలిపారు. అదేవిధంగా చందోలు గ్రామపంచాయతీ శివారు పంట పొలాలలో పేకాడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

రేపు సచ్చిదానంద మూర్తి శత జయంతి

తెనాలి అర్బన్, సెప్టెంబరు 22: తత్త్వవేత్త, పద్మవిభూషణ్ సచ్చిదానంద మూర్తి శత జయంతి ఈ నెల 24న జరుగుతుందని, సభను జయప్రదం చేయాలని వివేకా ఎడ్యుకేషన్ సొసైటీ డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ పిలుపునిచ్చారు. శత జయంతి కరపత్రాలను ఆదివారం నాజరుపేటలోని స్కూల్‌లో విడుదల చేశారు. బుర్రిపాలెం రోడ్డులోని వివేకానంద సెంట్రల్ స్కూల్‌లో నిర్వహించిన సభలో రచయిత విశ్రాంత ఐఏఎస్ అధికారి వాడ్రేవు చినవీరభద్రుడు పాల్గొని ప్రసంగిస్తారని చెప్పారు.



చావలిలో ఇంటిగోడపై ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్ అంటిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కూటమి పాలనతో అందరికీ న్యాయం

● ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, సెప్టెంబరు 22 : కూటమి పాలనతో అందరికి న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు నిర్వహిస్తున్న 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం చావలి కళ్యాణ మండపంలో గ్రామ సర్పంచ్, జనసేన నాయకుడు విష్ణుమొలకల శ్రీనివాసరావు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. వాలేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే తొలుత పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను గోడలపై ఆయన స్వయంగా అంటించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పాలన చంద్రబాబు నేతృత్వంలో పవన్ సహకారంతో ముందుకు నడుస్తుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి పిచ్చిరెడ్డి, ఎంపీడీవో అనూరాధ, తహసీల్దార్ సుశీల, బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, నియోజకవర్గ జనసేన సమన్వయకర్త ఊసా రాజేష్, టీడీపీ మండల అధ్యక్షుడు దండే వెంకటసుబ్బారావు, జనసేన, టీడీపీ నాయకులు శివారెడ్డి, కొల్లూరు మండల టీడీపీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, తూనుగుంట్ల సాయిబాబు, ఇక్కుర్తి నాగయ్య, దాది లక్ష్మణ్, చిన్న పద్దయ్య, గోపాలం సుబ్బారావు, దశరధ నాగమల్లేశ్వరరావు, శివలింగప్రసాద్, గాజుల కృష్ణమూర్తి పలు శాఖల అధికారులు, ఉద్యోగులు, గ్రామ ప్రజలు, పార్టీల శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు యలవర్రులో ప్రజావేదిక

అమృతలూరు, సెప్టెంబరు 22 : కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మహబూబ్ సుభాని ఆదివారం తెలిపారు. మండల పరిధిలోని యలవర్రు గ్రామంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు హాజరుకానున్నట్లు చెప్పారు. మండల స్థాయి అధికారులందరూ ఆయా ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు.

శ్మశానవాటికలో స్నానవాటిక ప్రారంభం

భట్టిప్రోలు, (కొల్లూరు), సెప్టెంబరు 22 : శ్మశాన వాటికలో నూతనంగా నిర్మించిన స్నాన వాటికను ఆదివారం దాత శ్రీరాములు ప్రారంభించారు. భట్టిప్రోలు అద్దేపల్లిలోని శ్మశాన వాటికలో కుందేటి లక్ష్మీనారాయణ, శ్యామలాంబ జ్ఞాపకార్థం వారి కుమారుడు రూ.1,25,000లతో స్నానవాటిక నిర్మింపజేశారు. ఈ నిర్మాణం పూర్తి కావడంతో దాత చేత కమిటీ సభ్యులు ప్రారంభింపజేశారు. దాత శ్రీరాములు మాట్లాడుతూ, శ్మశాన వాటిక అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొలిశెట్టి శ్రీనివాసరావు, కుందేటి శ్రీనివాసరావు, రమేష్, చంద్రకిషోర్, శ్రీమన్నారాయణ, శివప్రసాద్ పాల్గొన్నారు.

అబాకస్ పోటీలలో బాపట్ల విద్యార్థుల ప్రతిభ

బాపట్ల రూరల్, సెప్టెంబరు 22 : రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీలలో బాపట్ల విద్యార్థులు అత్యంత ప్రతిభను కనబరిచారు. ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీలలో బాపట్ల విద్యార్థులు బహుమతులు సాధించారని యూసీఎస్ బాపట్ల సంస్థ డైరెక్టర్ బొనిగల రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని యూసీఎస్ అబాకస్ ఇనిస్టిట్యూట్‌లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మత్స్యశాఖ జిల్లా అధికారి డి.సురేష్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అబాకస్ నేర్చుకోవటం వల్ల పిల్లలకు ఎంతో ఉపయోగం ఉందని, రాబోయే రోజుల్లో పోటీ పరీక్షలకు అబాకస్ చాలా ఉపయోగమన్నారు. అబాకస్ నేర్చుకున్న విద్యార్థులు పోటీ పరీక్షలలో ఖచ్చితంగా విజయం సాధిస్తారని తెలిపారు. అబాకస్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మదిర భూషణరావు, సంస్థ డైరెక్టర్ వనమా స్మైలి తదితరులు పాల్గొన్నారు.



అబాకస్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులు

ఘనంగా ఆడపిల్లల దినోత్సవం

వేమూరు, సెప్టెంబరు 22 : అంతర్జాతీయ ఆడపిల్లల దినోత్సవం పురస్కరించుకుని బూతుమల్లిలోని మోడ్రన్ రిచ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. వేమూరు పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించి ఆడపిల్ల ప్రాముఖ్యతపై ప్లకార్డులతో ప్రచారం చేశారు. కార్యక్రమంలో మోడ్రన్ రిచ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రిన్సిపల్ జయకుమార్, వైస్ ప్రిన్సిపల్ రాజేష్, మోషే, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న మోడ్రన్ రిచ్ స్కూల్ విద్యార్థులు

వ్యవస్థలను గాడిలో పెడుతున్న ప్రభుత్వం

● పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మనోహర్

తెనాలి రూరల్, సెప్టెంబరు 22: వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయి వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేసిందని, ఎన్డీఏ అధికారం చేపట్టిన నాటి నుంచి వాటిని తిరిగి గాడిలోపెట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించి ప్రజల సంక్షేమానికి పెద్దపీటవేస్తూ ప్రణాళికతో ముందుకు సాగుతుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో మంత్రి నాదెండ్ల మనోహర్ కూటమి వందరోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మంత్రి మనోహర్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ఐదేళ్ల పాలన విధ్వంసం తప్ప అభివృద్ధి లేదని ఆరోపించారు. ప్రజల కోసం పనిచేయాల్సిన వ్యవస్థలు స్వార్థపరులైన అప్పటి ప్రజాప్రతినిధుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారారని ఆరోపించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎన్నడూ లేని విధంగా గంజాయి, నాసిరకం మద్యం, లా అండ్ ఆడర్ పూర్తిగా అదుపుతప్పి రాష్ట్రం రావణ కాష్టంగా మార్చారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు వైసీపీ పాలన ఫలితంగా అదుపుతప్పిన వ్యవస్థలను, రాష్ట్ర పరిస్థితి చక్కదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. గంజాయిపై ఉక్కుపాదం మోపామన్నారు. కార్యక్రమంలో పలువురు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న నాయకులు

కల్తీ లడ్డూ బాధ్యులను శిక్షించాలి

చినగంజాం, సెప్టెంబరు 22 : తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ ప్రసాదంలో కల్తీకి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ కూటమి నాయకులు డిమాండ్ చేశారు. శ్రీవారి ప్రసాదాన్ని కల్తీ చేసి హిందూ ధర్మానికి హాని కలిగించాలని చూసిన శిక్షించాలని కోరుతూ టీడీపీ కూటమి నాయకులు మండలంలోని కడవకుదురు గ్రామంలోని కమ్యూనిటీ భవనం వద్ద ఆదివారం రాత్రి జగన్‌రెడ్డి దిష్టిబొమ్మతో నిరసన వ్యక్తం చేసిన అనంతరం దిష్టిబొమ్మను దహనం చేశారు. లడ్డూ ప్రసాదం వ్యవహారంలో చేసిన మోసంపై జగన్‌రెడ్డిని వెంకన్న స్వామి తప్పక శిక్షస్తారని నాయకులు అన్నారు. ఇలాంటి చర్యలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు పొట్టి వెంకటశ్రీనివాసరావు, చల్లా వెంకటరావు, మదాసు ప్రసాదు, సందు శ్రీనివాసరావు, తోట అశోకచక్రవర్తి, అనంత వెంకటేశ్వరరావు, సీ.హెచ్.శ్రీనివాసరావు, శివకోటి సుబ్బారావు, అనంత యశ్వంత్, పూల అనిల్‌కుమార్, గాజుల వంశీకృష్ణ, మధు, శివనారాయణ, వెంకటరావు, తోట నాగూర్ పాల్గొన్నారు.

సింగరకొండ దేవస్థానం ఈవోగా తిమ్మనాయుడు


తిమ్మనాయుడు

అద్దంకి, సెప్టెంబరు 22 : సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం ఈవో, అసిస్టెంట్ కమిషనర్‌గా ఎం.తిమ్మనాయుడును నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ నుంచి ఉత్తర్వులు అందాయి. ఇప్పటి వరకు ఇక్కడ ఈవోగా పనిచేసిన సుభద్రను గుంటూరులోని లాలాపేట శ్రీజగన్నాథ, ఆంజనేయ, వేంకటేశ్వర స్వామి దేవస్థానాలకు ఈవోగా బదిలీ చేశారు.

రత్తమ్మకు ఎమ్మెల్యే ఏలూరి నివాళి


రత్తమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

జాగర్లమూడి (పర్చూరు), సెప్టెంబరు 22 : తెలుగుదేశం పార్టీ పర్చూరు నియోజకవర్గ సీనియర్ నాయకుడు దూళిపల్లి వెంకటస్వామి మాతృమూర్తి దూళిపల్లి రత్తమ్మ దశదిన కర్మ ఆదివారం జాగర్లమూడిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొని రత్తమ్మ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఏలూరితోపాటు పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పెద్ద ఎత్తున పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ కఠారి రమేష్ నాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యులు దాసరి ఉషారాణి, కొల్లా సుభాష్ బాబు, నాయకులు నాయుడు హనుమంతురావు, రంగయ్య చౌదరి, షేక్ షంషుద్దీన్, మక్కెన శేఖర్‌బాబు, ఫ్యాక్టరీ శ్రీనివాసరావు, పోహూరి శ్రీనివాసరావు, తాటి నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి రూ.2.60లక్షల విరాళం

పర్చూరు, సెప్టెంబరు 22: విజవాడ వరద బాధితుల సాయం కోసం సీఎం సహాయ నిధికి మండలం చెరుకూరు గ్రామస్థులు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఉషారాణి ఆధ్వర్యంలో రూ.2.5లక్షల చెక్కును ఆదివారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును కలసి అందజేశారు. అదేవిధంగా అన్నంబొట్లంవారి పాలెం గ్రామానికి చెందిన రైతు గోరంట్ల రంగారావు రూ.10,116 చెక్కును అందజేసి దాతృత్వం దాటుకున్నారు. కార్యక్రమంలో దాసరి రామకృష్ణ, పాలేరు కోటేశ్వరరావు, అప్పలనేని నరేంద్ర, చెన్నుపాటి కిషోర్, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతపల్లిపాడు గ్రామస్థుల సాయం

యద్దనపూడి(మార్టూరు): యద్దనపూడి మండలం చింతపల్లిపాడు గ్రామస్థులు విజయవాడలోని వరద బాధితులకు తమ వంతుసాయంగా రూ.లక్షా 25వేలను విరాళంగా అందచేశారు. వారు ఈ నగదును సీఎం సహాయ నిధికి చెక్కు రూపంలో ఆదివారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు అందచేశారు. గ్రామానికి చెందిన కర్లపూడి నారాయణస్వామి ఆధ్వర్యంలో 65 వేల చెక్కు, గోరంట్ల సాంబయ్య ఆధ్వర్యంలో రూ.60 వేల చెక్కును ఏలూరికి అందచేశారు.

రిజిస్ట్రేషన్ శాఖలో భారీగా బదిలీలు

» రెండేళ్లు నిండిన వారికి స్థానచలనం

ఒంగోలు (క్రైం), సెప్టెంబరు 22 : రిజిస్ట్రేషన్ శాఖలో భారీగా బదిలీలు జరిగాయి. రెండేళ్లు ఒకేచోట పనిచేస్తున్న వారికి స్థానచలనం కల్పించారు. జిల్లా రిజిస్ట్రార్‌గా నెల్లూరు నుంచి ఎ.ఆంజనేయులును నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న ఉపేంద్రరావును విశాఖపట్నంకు బదిలీ చేశారు. ఈనెల 20న బాధ్యతలు స్వీకరించిన ఎ.ఆంజనేయులు శనివారం ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పనిచేస్తున్న అటెండర్లు, జూనియర్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీలు చేశారు. ఆదివారం రిజిస్ట్రేషన్ శాఖ గుంటూరు ఐజీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌లు, సబ్ రిజిస్ట్రార్‌ల బదిలీలు జరిగాయి. ఒంగోలు జాయింట్ వన్ సబ్ రిజిస్ట్రార్‌గా చిలకలూరిపేటలో పనిచేస్తున్న కె.శ్రీనివాసరావు, ఒంగోలు జాయింట్-2గా కావలిలో పనిచేస్తున్న కె.రాంబాబును నియమించారు. సింగరాయకొండలో పనిచేస్తున్న సిహెచ్.శ్రీనివాసరావును సంతనూతలపాడుకు, చీమకుర్తిలో పనిచేస్తున్న ఎ.వాసుదేవరెడ్డి కనిగిరి బదిలీ చేశారు. కనిగిరిలో పనిచేస్తున్న పి.గిరిజను మార్కాపురం జాయింట్-1గా, ఒంగోలు ఆడిట్‌లో ఉన్న విజయలక్ష్మిని మార్కాపురం జాయింట్-2గా స్థానచలనం కల్పించారు.

పొదిలికి గుంటూరు జిల్లా నుంచి వి.నీరజ, చీమకుర్తికి మురళీధర్, నెల్లూరు జిల్లా నుంచి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డిని అమ్మనబ్రోలుకు బదిలీ చేశారు. అమ్మన బ్రోలులో పనిచేస్తున్న సుబ్రహ్మణ్యంను పర్చూరు, అద్దంకిలో పనిచేస్తున్న ఎంబీ శ్రీనివాసరావును దర్శికి స్థానచలనం కల్పించారు. కందుకూరు నుంచి సుభాన్‌బాషాను ఎర్రగొండపాలెం, పొదిలిలో పనిచేస్తున్న ఎన్.ప్రసాద్‌ను ఒంగోలు ఆడిట్ ఆఫీస్‌కు, మార్టూరు సబ్ రిజిస్ట్రార్ ఎం.చినరామకోటయ్యను కందుకూరు, ఇంకొల్లులో పనిచేస్తున్న టి.రామలతను సింగ రాయకొండ బదిలీ చేశారు. నెల్లూరు జిల్లాలో పనిచేస్తున్న నవకుమార్‌ను అద్దంకి సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు. సీనియర్ అసిస్టెంట్‌ల బదిలీల ప్రక్రియ రాత్రివరకూ జరుగుతోంది.

దామచర్ల వర్సెస్ బాలినేని

» తూటాల్లా పేలిన మాటలు
» ఫ్లెక్సీల రగడ ముగియకముందే మరో వివాదం
» జనసేనలో చేరినా వదలం : దామచర్ల
» విచారణకు సిద్ధమని ముఖ్యమంత్రికే లేఖ రాశా: బాలినేని

ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి మధ్య మాటలు తూటాల్లా పేలాయి. వైసీపీ నుంచి కూటమి పార్టీల్లో ఒకటైన జనసేనలోకి బాలినేని చేరబోయే ముందే ఈ ఇద్దరి నాయకులు మాటలతో మంటలు రేపారు. ఒకరు వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేయగా, మరొకరు విచారించుకోమని ఎప్పుడో చెప్పానని వ్యాఖ్యానించారు. ఈ పరిణామాలు జిల్లాలో చర్చనీయాంశమయ్యాయి. శనివారం ప్రారంభమైన ఫ్లెక్సీల రగడ ముగియక ముందే ఆదివారం దామచర్ల మరోసారి బాలినేనిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అయితే బాలినేని తన సహజశైలికి విరుద్ధంగా దామచర్ల వ్యాఖ్యలపై సుతిమెత్తగా వ్యాఖ్యానాలు చేశారు. ఈ ఇద్దరి నేతల మధ్య పోరు మున్ముందు కూటమి ప్రభుత్వంలోని భాగస్వామ్య పార్టీల మధ్య విభేదాలకు కారణమవుతాయా? అన్న అనుమానాలు మొదలయ్యాయి.


ఆంధ్రజ్యోతి, ఒంగోలు

ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో 2012 నుంచి దామచర్ల జనార్దన్, బాలినేని శ్రీనివాసరెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీపడుతున్నారు. నాలుగు సార్లు టీడీపీ నుంచి దామచర్ల, వైసీపీ నుంచి బాలినేని పోటీ చేయగా చెరు రెండు పర్యాయాలు గెలుపొందారు. ఈ ఇద్దరి మధ్య రాజకీయ వైరం రెండు సంవత్సరాలుగా వ్యక్తిగత వైరంగా కూడా రూపాంతరం చెందింది. ఈనేపథ్యంలో సాధారణ ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేసి ఓటమి చెందిన బాలినేని శ్రీనివాసరెడ్డి ఆపార్టీకి గుడ్‌బై చెప్పారు. ఈనెల 26వ తేదీన ఆయన జనసేనలో చేరబోతున్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన పార్టీలు కూటమి ప్రభుత్వంలో ప్రధాన భాగస్వాములుగా ఉన్న విషయం విదితమే. దీంతో రానున్న రోజుల్లో జిల్లాలోనూ, ప్రధానంగా ఒంగోలులోనూ ఎలాంటి రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటాయోనన్న చర్చ ప్రజానీకంలో ఆరంభమైంది. ఈదశలో శనివారం జనసేనలో చేరబోతున్న బాలినేనికి స్వాగతం చెబుతూ కొందరు ఫ్లెక్సీలు వేశారు. అందులో జనార్దన్ ఫొటో కూడా పెట్టడంపై కొందరు తెలుగుదేశం వర్గీయులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆఫ్లెక్సీలను కార్పొరేషన్ సిబ్బంది తొలగించారు. ఆవివాదం పూర్తిగా ముగియక ముందే ఆదివారం దామచర్ల జనార్దన్ తన తాత అయిన మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు వర్ధంతి సభలో బాలినేనిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బాలినేని జనసేనలో చేరినా గతంలో చేసిన అవినీతి వ్యవహారాలను వదలబోమంటూ మండిపడ్డారు. ఆతర్వాత ఒంగోలులో బాలినేని మీడియాతో మాట్లాడుతూ తాను తగ్గేది లేదన్నట్లు వ్యాఖ్యానాలు చేశారు. దీంతో రానున్న రోజుల్లో కూటమి పార్టీల మధ్య ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయోనన్న ఆసక్తి ఆరంభమైంది.

తండ్రీ కొడుకుల అవినీతి వెలికితీస్తాం: దామచర్ల

అవినీతి, అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు మాజీ మంత్రి బాలినేని పార్టీలు మారుతున్నారని, ఆయన జనసేనలో చేరినా వదిలే ప్రసక్తి లేదని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ స్పష్టం చేశారు. ఆదివారం టి.నాయుడు పాలెంలో జరిగిన మాజీ మంత్రి ఆంజనేయులు వర్ధంతి సభలో దామచర్ల మాట్లాడారు. అధికారంలో ఉన్నన్ని రోజులూ అందరినీ ఇబ్బందులు పెట్టి అవినీతి, అక్రమాలకు పాల్పడి వంద రోజులు గడవకముందే పార్టీ మారుతున్నారంటూ బాలినేనికి దామచర్ల చురకలు వేశారు. 'నేను కానీ, దామచర్ల కుటుంబం కానీ ఒక కమిట్‌మెంట్‌తో ఉంటాం. ఇబ్బందులు వస్తే రాజకీయాలు మానుకుంటామే తప్ప పార్టీలు మారం. బాలినేని జిల్లాను సర్వనాశనం చేశాడు. వైసీపీని భ్రష్టు పట్టించాడు. ఆయన, ఆయన కుమారుడు అనేక అవినీతి, అక్రమ వ్యవహారాలకు పాల్పడ్డారు. ఇప్పుడు పార్టీ మారి జనసేనలో చేరతారట. ఆ పార్టీలో చేరినంత మాత్రాన తప్పులు ఒప్పులు కావు. ఆయనను వదిలే ప్రసక్తే లేదు' అని దామచర్ల స్పష్టం చేశారు. 'వైసీపీ ప్రభుత్వంలో ఆయన నాపైన 33 కేసులు పెట్టారు. టీడీపీ శ్రేణులు చాలామందిపై కేసులు పెట్టించారు. ఆయన, ఆయన కుమారుడు చేసిన అవినీతి వ్యవహారాలు చాలా ఉన్నాయి. ఇవేమీ నేను మర్చిపోను. అన్నీ బయటికి తీస్తా. ఆయనకు పవన్ కల్యాణ్ అండ ఉండొచ్చు. అంతమాత్రాన మాపార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని వదులుతామా?' అని జనార్దన్ అన్నారు. గత ఎన్నికల్లో నాతో కలిసి కూటమి పార్టీల విజయం కోసం పనిచేసిన జనసేన, బీజేపీ వారికి నేను అండగా ఉంటానని, కాపాడుకుంటానని జనార్దన్ ప్రకటించారు.


దామచర్ల జనార్దన్


బాలినేని శ్రీనివాసరెడ్డి

మీరు విచారించుకోండి: బాలినేని

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 22: తనపై వచ్చిన ఆరోపణలపై విచారణకు ఎప్పుడైనా సిద్ధమని మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఇదేవిషయమై 15 రోజుల క్రితమే సీఎం చంద్రబాబునాయుడుకు కూడా లేఖ రాశానని తెలిపారు. స్థానిక లాయర్‌పేటలోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీలో తనకు ఇబ్బందులు ఉన్నందునే పార్టీ మారుతున్నట్లు తెలిపారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు తనపై మొదటి నుంచి మంచి అభిప్రాయం ఉందన్నారు. ఆయన సమక్షంలో ఈనెల 26న జనసేనలో చేరుతున్నట్లు వెల్లడించారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని తెలిపారు. ఒంగోలులో ఫ్లెక్సీలు ఎవరు ఏర్పాటుచేశారో కూడా తనకు తెలియదన్నారు. వాటిలో టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఫొటోలు ఉన్నాయని తొలగించారన్నారు. ఇకపై జనార్దన్ ఫొటోలు లేకుండా ఫ్లెక్సీలు కట్టుకోవాలని మావాళ్లకు చెప్తానని బాలినేని స్పష్టం చేశారు. వైసీపీకి రాజీనామా చేసిన అనంతరం మొదటిసారిగా ఒంగోలుకు వచ్చిన బాలినేనికి అభిమానులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో గొర్రెపాటి శ్రీనివాసరావు, గోలి తిరుపతిరావు, వర్ధు శేషయ్యతోపాటు పలువురు ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

వంద రోజుల్లోనే రాక్షస పాలన నుంచి విముక్తి

» విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి
» మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులుకు ఘన నివాళి


మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

టంగుటూరు, సెప్టెంబరు 22: 'వందరోజుల్లో ఏమీ జరగలేదని విమర్శలు చేస్తున్నారు. పాస్‌పుస్తకాల మీద నీ బొమ్మను తొలగించి, నీరాక్షస పాలన నుంచి ప్రజలను విముక్తులను చేశాం, వెయ్యి రూపాయల పింఛన్ పెంచి ఒకటో తేదీనే ఇసున్నాం..'అధికారంలోకి రాకముందు జనంలో- అధికారంలో వచ్చాక కోటలో' బతికిన నీవా మా ప్రభుత్వం గురించి మాట్లాడేదని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాజీ సీఎం జగన్‌నుఉద్దేశించి తీవ్రంగా విమర్శించారు. ఆదివారం టంగుటూరు మండలంలోని తూర్పునాయుడుపాలెంలో జరిగిన మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు వర్ధంతి సభలో గొట్టిపాటి మాట్లాడారు. జగన్ పాలన అంతా కల్తీగానే సాగిందని, ఇప్పుడు ఆ పార్టీ నాయకులతోపాటు కార్యకర్తలు కూడా జగన్‌ను విశ్వసించడం లేదని మండిపడ్డారు. ప్రకృతి విపత్తు వస్తే నీలా మా ముఖ్యమంత్రి కోటలో కూర్చోలేదని, ప్రజలకు కష్టాల్లో తోడుగా నిలిచాడని మంత్రి అన్నారు తిరుపతి వేంకటేశ్వర స్వామి ప్రసాదాన్ని కూడా కల్తీ చేసి చరిత్రలో కల్తీ ముఖ్యమంత్రిగా మిగిలిపోయారని గొట్టిపాటి దుయ్యబట్టారు. దివంగత మంత్రి దామచర్ల ఆంజనేయులు నిబద్ధత గల నాయకుడని కొనియాడారు.

సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ వంద రోజుల పాలనలో చరిత్ర సృష్టించిన ఘనత చంద్రబాబుదన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని, అందరికీ ఆదర్శప్రాయంగా ఉంటున్నారన్నారు. తిరుపతి ప్రసాదాన్ని కూడా కమిషన్ల కోసం కక్కుర్తి పడి జగన్ నాశనం చేశాడని దుయ్యబట్టారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దామచర్ల ఆంజనేయులు గొప్ప నాయకుడన్నారు. నరసరావుపేట ఎంపీ లావు కృష్ణదేవరాయలు మాట్లాడుతూ దామచర్ల ఆంజనేయులు ప్రజలకు గొప్పసేవలు అందించారన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ విలువలతో కూడిన రాజకీయాలు చేస్తామని, తన తాతను ఆదర్శంగా తీసుకుని రాజకీయాల్లో పనిచేస్తున్నామన్నారు. కష్ట, విధిలేని పరిస్థితులు వస్తే రాజకీయాలనుంచి వైదొలుగుతామేకాని, పార్టీలు మారబోమన్నారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య అధ్యక్షతన జరిగిన సభలో ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, ముత్తుముల అశోక్‌రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు పోతుల రామారావు, దివి శివరాం, ఇన్‌చార్జిలు గొట్టిపాటి లక్ష్మి, ఎరిక్షన్‌బాబు, నూకసాని బాలాజీ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు మంత్రి గొట్టిపాటి మరో మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామితో కలిసి గ్రామంలో నాలుగున్నర కోట్ల రూపాయలతో మంజూరైన 11కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన, రూ. 60 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లను ప్రారంభించారు. మల్లవరప్పాడు గ్రామంలో ఏర్పాటు చేసిన దివంగత సీఎం ఎన్టీఆర్, దివంగత మంత్రి దామచర్ల ఆంజనేయులు విగ్రహాల మంత్రులు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు.

ఎంపీడీవోల బదిలీలు

» 16 మంది ఇక్కడకు రాక » ఇతర జిల్లాలకు 16 మంది

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 22 : ఉద్యోగోన్నతులపై పనిచేస్తున్న ఎంపీడీవోల బదిలీలు షురూ అయ్యాయి. ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న జిల్లాకు చెందిన 16 మంది ఎంపీడీవోలను ఇక్కడికి, ఇక్కడ పనిచేస్తున్న ఇతర జిల్లాలకు చెందిన 16 మందిని వారి పాత జిల్లాలకు బదిలీలు చేస్తూ పంచాయతీరాజ్ డైరెక్టర్ కృష్ణతేజ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎనిమిది నెలల క్రితం అప్పటి ప్రభుత్వం ఉద్యోగోన్నతులపై ఎంపీడీవోలుగా పలువురిని ఇతర జిల్లాలకు బదిలీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న అధికారులను అంతర్ జిల్లాలకు స్థానచలనం కల్పించేందుకు అవకాశం కల్పించింది. జిల్లా నుంచి 16 మంది ఎంపీడీవోలు బదిలీ అయ్యారు. వారిలో గుంటూరు జిల్లాకు 11 మందిని, నెల్లూరు జిల్లాకు నలుగురిని, కృష్ణా జిల్లాకు ఒకరిని బదిలీ చేశారు. ఇతర జిల్లాల నుంచి జిల్లాకు 16 మంది బదిలీపై వస్తున్నారు. వారిలో గుంటూరు, నెల్లూరు జిల్లాల నుంచి ఆరుగురు చొప్పున, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, విజయనగరం, చిత్తూరు జిల్లాల నుంచి ఒక్కొక్కరు జిల్లాకు రానున్నారు.

జిల్లాకు వచ్చే ఎంపీడీవోలు వీరే

చక్రపాణి ప్రసాద్, రంగనాయకులు, టీవీరభద్రాచారి, వై.మహాలక్ష్మి, ఎం.శ్రీదేవి, పి.శివ సుబ్రహ్మణ్యం, డి.ఈశ్వరమ్మ, వి.జ్యోతి, జి.శ్రీనివాసరావు, ఎం.రాజేష్‌బాబు, బి.సింగయ్య, ఎం.రంగ సుబ్బారాయుడు, బి.శ్రీనివాసులు, జి.జ్యోతిర్మయి, ఎస్‌కే మహ్మద్ అక్బబ్‌జావీద్, ఎల్.కృష్ణమూర్తి జిల్లాకు రానున్నారు. ఇక్కడి జిల్లా పరిషత్‌లో జాయినింగ్ రిపోర్టు ఇచ్చిన తర్వాత వారికి మండలాల్లో పోస్టింగ్‌లు ఇస్తారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు, సెప్టెంబరు 22: పవిత్ర పుణ్యక్షేత్రంగా వెలుగొందుతూ భక్తుల కోర్కెలు తీరుస్తున్న సోమవరప్పాడుపరిధిలోని గుంటిగంగ సన్నిధిలోగల గుంటి గంగాభవానీ తల్లికి ఆది వారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గంగ మ్మ తల్లికి పొంగళ్లు పెట్టి కరుణించమని వేడుకున్నారు. తాళ్లూరు పరిసర మండల గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ బ్రాహ్మణఅర్చకులు ఎస్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్‌పంతులు, బాలరాజులు అమ్మవారికి పూజలు నిర్వహించారు.

వైభవంగా గణనాథుని నిమజ్జనం

తాళ్లూరు: మండలంలోని కొర్రపాటివారిపాలెంలో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుని నిమజ్జన ఊరేగింపు ఆదివారం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్ సాగర్ దంపతులు, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు పాల్గొని గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే, తాళ్లూరు ఇస్మాయిల్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. ఆయా విగ్రహ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథులను నిమజ్జనానికి తరలించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ మల్లికార్జునరావు సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బి.బాలిరెడ్డి, మానం రమేష్‌బాబు పాల్గొన్నారు.

డ్వామాలో అవినీతిపై విజి'లెన్స్'

» పలు అంశాలపై వివరణ కోరుతూ పీడీకి నోటీసు
» గతంలో ప్రభుత్వానికి ఫిర్యాదు చేసిన ఈదర మోహన్

ఒంగోలు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా)లో భారీ అవినీతి చోటుచేసుకున్నదన్న ఆరోపణలపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించారు. జిల్లాలో 2019-24 మధ్య కాలంలో డ్వామాలో జరిగిన పలు కీలక పనులు, నియామకాలు, నిధుల వినియోగం తదితర అంశాలపై వివరణ కోరుతూ ప్రస్తుత డ్వామా పీడీకి ఒంగోలులోని విజిలెన్స్ విభాగం ఉన్నతాధికారైన అడిషనల్ ఎస్పీ కులశేఖర్ నోటీసు ఇచ్చారు. జిల్లాలో ఆ కాలంలో నాలుగున్నరేళ్లపాటు పీడీగా శీనారెడ్డి పనిచేశారు. ఆ సమయంలో పెద్దఎత్తున అవినీతి, అక్రమాలు, అధికార దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. అప్పటి వైసీపీ పెద్దల అండతో శీనారెడ్డి అక్రమాలకు పాల్పడ్డారన్న ప్రచారం సాగింది. ఇదేవిషయాన్ని గత నెలలో పలువురు ప్రభుత్వ పెద్దల దృష్టికి పీడీసీసీ బ్యాంకు మాజీ ఛైర్మన్ ఈదర మోహన్ తీసుకెళ్లి విచారణ చేయాలని కోరారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, విజిలెన్స్ ఉన్నతాధికా రులతోపాటు రాష్ట్రంలో ప్రభుత్వ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు పంపించారు. జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి తదితరులకు నిర్దిష్ట ఆరోపణలతో మోహన్ ఫిర్యాదు చేశారు. ఆ ఐదేళ్ల కాలంలో డ్వామాలో సుమారు రూ.3,383 కోట్ల మేర నిధులు ఖర్చు చేయగా దాదాపు రూ.500 కోట్లు దుర్వినియోగమైనట్లు ఆయన ఆరోపించారు. అందుకు అప్పటి పీడీ శీనారెడ్డి బాధ్యుడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రధానంగా జగనన్న కాలనీల్లో అభివృద్ధి పనులు, ఉద్యోగుల నియామకాలు, సోషల్ ఆడిట్ ఫిర్యాదుల పరిష్కారం, వ్యక్తిగతంగా వాహనాలకు అక్రమంగా బిల్లులు డ్రా చేయడం తదితర దాదాపు 20 అంశాలను ఆయన పేర్కొన్నారు. ఆ సంస్థలో పనిచేసిన మరో ఇద్దరు ముగ్గురు ఉద్యోగులు కూడా అలాగే ప్రభుత్వ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

కాగా మోహన్ తొలుత పురందీశ్వరికి ఇచ్చిన ఫిర్యాదు ఆపార్టీ తరఫున పరిశీలన కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులకు పంపారు. మంత్రి స్వామి తన దృష్టికి వచ్చిన ఫిర్యాదుపై సమగ్ర విచారణ, చర్యలు కోరుతూ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్‌కు లేఖ రాయడమేకాక స్వయంగా దాన్ని ఆయనకు ఇచ్చారు. ఎమ్మెల్యే జనార్దన్ కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు తనకు మోహన్ ఇచ్చిన ఫిర్యాదు కాపీని అందజేసి విచారణ కోరారు. ఈ నేపథ్యంలో విజిలెన్స్ విభాగం ఈ అంశంపై దృష్టి సారించింది. జిల్లాలో డ్వామా పరిధిలో 2019-24 మధ్య నిధుల వినియోగం, చేసిన ప్రధాన పనులు, చెల్లింపులు, సిబ్బంది నియామకాలు తదితర అంశాల పరిశీలనకు నిర్ణయించుకున్న విజిలెన్స్‌శాఖ సంబంధిత వివరాలను అందజేయాలని ప్రస్తుత డ్వామా పీడీని కోరారు.


డ్వామాలో అవినీతిపై విచారణ కోరుతూ మంత్రి డాక్టర్ స్వామికి ఫిర్యాదు చేస్తున్న మోహన్(ఫైల్)

అధిష్ఠానం షాక్

టీడీపీ ఎమ్మెల్యేల మధ్య ఏకాభిప్రాయం లేని పోస్టులకు కొత్త అధికారులు

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలకు అధిష్ఠానం షాకిచ్చింది. వారి మధ్య ఏకాభిప్రాయం కుదరని వివిధ ప్రభుత్వ శాఖలకు అధికారుల నియామకం విషయంలో నేరుగా నిర్ణయం తీసుకుంది. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ఒకటికి రెండు పేర్లను సూచించిన నేపథ్యంలో ఈమేరకు నిర్ణయం తీసుకుంది. ఆదివారం సాయంత్రం విడుదలైన బదిలీల ఉత్తర్వులను పరిశీలిస్తే ఈవిషయం తేటతెల్లమవుతోంది. ఆయా శాఖల జిల్లా అధికారుల పోస్టులకు ఎవరిని నియమించాలన్న అంశంపై జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు ఒక లేఖను తయారు చేసి అటు ముఖ్యమంత్రికి, ఇటు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఇచ్చారు. అయితే అందులో మూడు, నాలుగు శాఖల విషయంలో ఏకాభిప్రాయంతో ముందుకెళ్లలేకపోయారు. ఒక ఎమ్మెల్యే నాయకత్వం వహించి మంత్రి స్వామి మినహా, మిగిలిన శాసనసభ్యులు, ఇన్‌చార్జిల సంతకాలతో, డీపీవో, డ్వామా పీడీ, సీఈవో లాంటి మరో ఒకట్రెండు పోస్టులకు కొందరి అధికారుల పేర్లను సూచిస్తూ అధిష్ఠానానికి లేఖ ఇచ్చారు. మంత్రి స్వామి జిల్లా పంచాయతీ అధికారి, జడ్పీ సీఈవో, డ్వామా పీడీ మరోశాఖ అధికారి విషయంలో ప్రత్యేకంగా పేర్లను సూచించినట్లు తెలిసింది. ఎమ్మెల్యేలు ఇచ్చిన సిఫారసు లేఖల్లో మంత్రి సంతకం లేని వాటిని అధిష్ఠానం పక్కన పెట్టింది. అలాగే మంత్రి పంపిన లేఖల్లో మిగిలిన ఎమ్మెల్యేల సంతకాలు లేవు. దీంతో ఆ నాలుగైదు శాఖలకు వీరు విడివిడిగా సూచించిన వారిని కాకుండా కొత్త వారిని నియమించారు. ప్రధానంగా ఒక సీనియర్ ఎమ్మెల్యే డ్వామా పీడీ, డీపీవోల నియామకంపై అధిష్ఠానం వద్ద ఒత్తిడి చేసినట్లు తెలిసింది. అయినా పట్టించుకోకుండా విడివిడిగా వచ్చిన ప్రతిపాదనలు పక్కనపెట్టి వేరే అధికారులను ఆపోస్టులకు నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు.

డీపీవోగా గొట్టిపాటి

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 22 : జిల్లా పంచాయతీ అధికారిగా గొట్టిపాటి వెంకట నాయుడు నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఆదివారం రాత్రి ఉత్తర్వులు ఇచ్చారు. వెంకటనాయుడు ప్రస్తుతం అనంతపురం డ్వామా ఎఫ్‌ఎంగా పనిచేస్తున్నారు. బాపట్ల ఈటీసీలో పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డిని కనిగిరి డీఎల్‌డీవోగా నియమించారు.

జడ్పీ సీఈవోగా చిరంజీవి

జిల్లా పరిషత్ సీఈవోగా చిరంజీవి నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం నెల్లూరు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవోగా పనిచేస్తున్నారు. ఇక్కడికి డిప్యూటీ సీఈవోగా పావులూరి బాలమ్మను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఆస్థానంలో ఇక్కడ పనిచేస్తున్న హనుమంతరావును కమిషనరేట్‌లో రిపోర్టు చేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు. మార్కాపురం డీఎల్‌డీవోగా పనిచేస్తున్న నాగసాయికుమార్‌ను గుంటూరు జిల్లా డీపీవోగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

డ్వామా పీడీగా జోసఫ్‌కుమార్

జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్‌గా జి.జోసఫ్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ప్రస్తుతం గుంటూరు జడ్పీ డిప్యూటీ సీఈవోగా పనిచేస్తున్నారు. ఏలూరులో డ్వామా డీవీవోగా పనిచేస్తున్న విజయలక్ష్మి అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఇక్కడి రానున్నారు.

డీఎఫ్‌వోగా రాజశేఖర్‌రావు

జిల్లా ఫారెస్ట్ అధికారిగా కె.రాజశేఖరరావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన కృష్ణా జిల్లాలో పనిచేస్తున్నారు. ఇప్పటి వరకూ ఇక్కడ డీఎఫ్‌వోగా ఉన్న పి.సునీతను కృష్ణా జిల్లాకు బదిలీ చేశారు. గిద్దలూరు ఫారెస్టు డిప్యూటీ డైరెక్టర్ వైవీ నరసింహారావు చింతపల్లి డీఎఫ్‌వోగా నియమితులయ్యారు.

డీఆర్‌డీఏ పీడీ బదిలీ

డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి.వసుంధర బదిలీ అయ్యారు. ఆమెను నెల్లూరు డీఎల్‌డీవోగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఎన్నికల సమయంలో పంచాయతీరాజ్ కమిషనరేట్‌కు బదిలీపై వెళ్లిన జిల్లాకు చెందిన ఇరువురు అధికారులకు పోస్టింగ్‌లు లభించాయి. ఇక్కడ డీపీవోగా పనిచేసిన జీవీ నారాయణరెడ్డి బాపట్ల డీఎల్‌డీవోగా, జడ్పీ సీఈవోగా పనిచేసిన జాలిరెడ్డి సూళ్లూరుపేట డీఎల్‌డీవోగా నియమితులయ్యారు.


మాట్లాడుతున్న అర్చకులు

ప్రసాదంలో కల్తీ అపచారం

బాపట్ల అర్చక సంక్షేమ సంఘం

చీరాలటౌన్, సెప్టెంబరు 22 : స్వామి వారి నిత్య ప్రసాదంలో కల్తీకి పాల్పడి ఘోర అపచారానికి పాల్పడ్డారని బాపట్ల జిల్లా సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం చీరాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో అర్చకులు మాట్లాడారు. పరమ పవిత్రమైన తిరుమల క్షేత్రంలో స్వామి వారి లడ్డూ ప్రసాదంలో కమీషన్‌లకు కక్కుర్తిపడి జంతు వ్యర్థాలతో కల్తీకి దారి తీశారన్నారు. ఘటనతో తీవ్రంగా వారి మనోభావాలు దెబ్బతిన్నట్లు వివరించారు. కారకులెవరైనా సరే కఠిన శిక్షలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి వేదాంతం కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి దిట్టకవి వాసుదేవ సంపత్ కుమార్, మూలంరాజు రాజ్‌కుమార్, నారాయణం శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

సుందరరామిరెడ్డి సేవలు ప్రశంసనీయం

చీరాల, సెప్టెంబరు 22 : వ్యాయామ ఉపాధ్యాయుడిగా సుందరరామిరెడ్డి సేవలు ప్రశంసనీయమని ఆంధ్రప్రదేశ్ హాకీ ఫెడరేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎం.నిరంజనరెడ్డి అన్నారు. పేరాల గోలి సదాశివరావు కల్యాణ మండపంలో ఆదివారం వ్యాయామ ఉపాధ్యాయునిగా ఉద్యోగ విరమణ చేసిన సుందరరామిరెడ్డిని, పద్మావతి దంపతులను ఘనంగా సన్మానించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ హాకీ క్రీడకు వివిధ దశల్లో సుందరరామిరెడ్డి నైపుణ్యత కలిగిన క్రీడాకారులను అందించడంలో ప్రత్యేకత చాటుకున్నారన్నారు. కార్యక్రమంలో శ్రీకామాక్షి కేర్ హాస్పటల్ ఎండీ డాక్టర్ తాడివలస దేవరాజ్, వెంకటేశ్వరరావు, కుర్రా రామారావు, కృష్ణమోహన్, వెలుగొండ రెడ్డి, వీరాంజనేయులు, ఏడుకొండలు, పవని భానుచంద్రమూర్తి, ధన, ప్రకాష్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో శింగరకొండపాలెం ఎత్తిపోతల

- గత టీడీపీ ప్రభుత్వంలో రూ.70లక్షలతో మరమ్మతులు
- వైసీపీ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యం
- మళ్లీ మూలనపడ్డ పథకం
- 3వేల ఎకరాల ఆయకట్టుకు అందని సాగు నీరు


మూలనపడ్డ శింగరకొండపాలెం ఎత్తిపోతల పథకం

అద్దంకి, సెప్టెంబరు 22 : భవనాసి చెరువులో పుష్కలంగా నీరు అందుబాటులో ఉన్నా.. టీడీపీ ప్రభుత్వ హయాంలో 70లక్షల రూపాయలతో మరమ్మతులు చేసినా వైసీపీ హయంలో నిర్వహణపై దృష్టి పెట్టకపోవడంతో శింగరకొండపాలెం ఎత్తిపోతల పథకం పూర్తిగా మూలనపడి నిరుపయోగంగా మారింది. సుమారు 4 దశాబ్దాల కిందట టీడీపీ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఎత్తిపోతల పథకాల నిర్మాణం జరిగిన సమయంలో అద్దంకి మండలంలోని శింగరకొండపాలెం సమీపంలో భవనాసి చెరువు నీరు ఆధారంగా శింగరకొండపాలెం ఎత్తిపోతల నిర్మాణం జరిగింది. అద్దంకి మండలంలోని శింగరకొండపాలెం, కలవకూరు, బొమ్మనంపాడు, గోపాలపురం, అద్దంకి రైతులకు చెందిన సుమారు 3229 ఎకరాల ఆయకట్టుకు నీటి సరఫరా జరిగే విధంగా ఎత్తిపోతల పథకం నిర్మాణం జరిగింది. అద్దంకి మేజర్ కాలువ చివర భూములకు నీటి తడుల కోసం ఎత్తిపోతలను రూపొందించారు. దీని నుంచి అద్దంకి మేజర్ కాలువ వరకు భూమిలో పైప్‌లైన్‌లు వేశారు. పలు సందర్భాలలో ఎత్తిపోతల మోటార్‌లు మరమ్మతులకు గురికావడం, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు చోరీకి గురికావడంతో కొంత కాలం మూలన పడింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సుమారు 70లక్షల రూపాయలు వెచ్చించి మోటార్‌ల మరమ్మతులు, ఎక్కువ కెపాసిటీతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేశారు. రెండు సంవత్సరాలు నీటి సరఫరా జరిగింది. అనంతరం జగన్‌రెడ్డి పాలనలో దీని నిర్వహణపై పూర్తి నిర్లక్ష్యం వహించడంతో మూలన పడింది. దీంతో గత నాలుగైదు సంవత్సరాలుగా నీటి విడుదల జరగకుండా నిరుపయోగంగా మారింది. ఎత్తిపోతల పథకం ప్రాంతం మొత్తం చిట్టడవిని తలపించేలా మారింది. పైప్‌లైన్‌లు కూడా దెబ్బతిని ఉండడంతో నీటి సరఫరా కూడా అంతంతమాత్రంగా మారింది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రకటించడంతో శింగరకొండపాలెం ఎత్తిపోతల పథకం ఆయకట్టు రైతులలో ఆశలు చిగురించాయి. భవనాసి చెరువు రిజర్వాయర్‌గా మారే క్రమంలో ఎత్తిపోతల పథకం మోటార్‌లు ముంపునకు గురయ్యే అవకాశం ఉండడంతో పునఃనిర్మాణ చేపట్టేందుకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. రవికుమార్ మంత్రిగా ఉండడంతో ప్రత్యేక దృష్టి సారించి శింగరకొండపాలెం ఎత్తిపోతల పథకాన్ని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.


దట్టంగా పెరిగిన చెట్లు


చెట్ల మధ్య ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు


తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో నిలిపిన వాహనాలు

ప్రాంగణమే పార్కింగ్

- తహసీల్దార్ కార్యాలయం ముందు యథేచ్ఛగా వాహనాల నిలిపివేత
- ఉద్యోగులు, సిబ్బందికి ఇబ్బందులు

చీరాల, సెప్టెంబరు 22 : తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణం పార్కింగ్ స్థలంగా మారింది. తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఎంపీడీవో కార్యాలయం, ఎన్‌ఆర్‌ఈజీఎస్, సబ్ ట్రెజరీ, మీసేవా కేంద్రాలు ఉన్నాయి. రోజు ఆయా కార్యాలయాలకు వివిధ పనులపై వచ్చే వారి సంఖ్య గణనీయంగా ఉంటుంది. వాహనాలపై వచ్చే వారి సంఖ్య ఎక్కువ. అయితే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చే వారిలో ఎక్కువ మంది తమ కార్లు, ద్విచక్ర వాహనాలను తహసీల్దార్ కార్యాలయం వద్ద పార్క్ చేస్తున్నారు. దీంతో కార్యాలయ ఉద్యోగులు, కార్యాలయాలకు వివిధ పనులపై వచ్చేవారు తమ వాహనాలను పార్క్ చేసుకునేందుకు కొన్ని సందర్భాల్లో ఖాళీ జాగా లేక ఇబ్బంది పడుతున్నారు. ఆయా కార్యాలయ అటెండర్లు వారు చూచినపుడు ఇతర వాహనాలను తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో నిలపకుండా వారిస్తున్నారు. అయినప్పటికీ వారి లేని సమయంలో వెలుపల వ్యక్తుల వాహనాలను నిలపడంతో కొన్ని సందర్భాల్లో కార్యాలయ పనులపై వచ్చే వారు తమ వాహనాలు నిలుపేందుకు ఖాళీ లేక ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి కార్యాలయ ప్రాంగణంలో ఉద్యోగులు, కార్యాలయాలకు పనులపై వచ్చే వారి కాకుండా , ఇతర వ్యక్తులు అక్కడ వాహనాలు నిలపకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా రవీంద్ర



అద్దంకి, సెప్టెంబరు 22 : అద్దంకి మున్సిపాలిటీ మున్సిపల్ కమిషనర్‌గా డి.రవీంద్రను నియమిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. అద్దంకి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న సత్యనారాయణను ఏలేశ్వరం మున్సిపాలిటీ కమిషనర్‌గా బదిలీ చేశారు. అద్దంకి మున్సిపాలిటీలో సుదీర్ఘకాలం నుంచి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఎం.శ్రీనివాస రెడ్డిని ఖైదుకూరు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. కొత్తగా వస్తున్న కమిషనర్ రవీంద్ర ఒంగోలు కార్పొరేషన్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేశారు.

కారుపైకి దూసుకెళ్లిన బైకు

- ఎగిరి కిందపడిన వెనుక కూర్చున్న విద్యార్థి
- ఇద్దరికి తీవ్ర గాయాలు, ఒకరు గుంటూరు తరలింపు


అపస్మారక స్థితిలో ఫిలిప్


గాయాలతో ఉన్న మహేష్

చీరాలటౌన్, సెప్టెంబరు 22 : ఆదివారం మధ్యాహ్నం ఇద్దరు మైనర్‌ల ద్విచక్ర వాహనం కారుపైకి దూసుకెళ్లింది. వివరాల్లోకి వెళితే చీరాల పరిధిలోని రోశయ్య కాలనీకు చెందిన వేటగిరి మహేష్ కొత్తపేట ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదవుతున్నాడు. అలాగే అదే ప్రాంతానికి చెందిన ఎండేటి ఫిలిప్ కూడా అదే పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదవుతున్నాడు. వీరు ఇంటినుంచి చీరాలకు వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై బయలు దేరారు. మహేష్ హెల్మెట్ ధరించి బండి నడుపుతుండగా ఫిలిప్ వెనుక కూర్చున్నాడు. వీరి ఇంటి సమీపంలో మట్టి రోడ్డు నుంచి ప్రధాన రహదారిలోకి వస్తూ రామాపురం నుంచి చీరాల వైపు వస్తున్న గోపీరాజు కారును సైడ్ నుంచి వేగంగా ఢీ కొట్టారు. ప్రమాదంలో వెనుక కూర్చున్న ఫిలిప్ ఎగిరి కారు అద్దంపై పడ్డాడు. మహేష్ హెల్మెట్ సైతం ఎగిరి పడగా ఇద్దరు తీవ్ర రక్త గాయాలపాలయ్యారు. దీంతో కారు డ్రైవర్ గోపీరాజు వీరిని స్థానికుల సహకారంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఫిలిప్‌ను గుంటూరుకు తరలించగా, మహేష్ చీరాల ఏరియా హాస్పిటల్లోనే చికిత్స పొందుతున్నాడు. దీంతో సమాచారం అందుకున్న టూటౌన్ ఎస్సై శ్రీనివాసరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

బల్లికురవ, సెప్టెంబరు 22 : ఎరువులను ఎవరైనా బ్లాక్ చేసి కృత్రిమ కొరత సృష్టిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ ఏవో కుమారి హెచ్చరించారు. ఆదివారం మండలంలోని కొమ్మినేనివారిపాలెం, కొప్పెరపాడు, గొర్రెపాడు, కూకట్లపల్లి గ్రామాలలో ఉన్న ఎరువుల దుకాణాలను ఏవో తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎరువుల స్టాక్, రికార్డులను ఆమె తనిఖీ చేశారు. ఎమ్మార్పీ ధరకే ఎరువులను విక్రయించాలన్నారు. రైతులు కొన్న ప్రతి దానికీ బిల్లును తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. లైసెన్స్‌లు లేకుండా అమ్మితే కేసులు తప్పవన్నారు. యూరియా రూ.266, డీఏపీ రూ.1350 ధరకు విక్రయించాలని ఏవో కుమారి సూచించారు.

మోపెడ్ ఢీకొని ముగ్గురికి గాయాలు

ఇంకొల్లు, సెప్టెంబరు 22 : మద్యం సేవించి స్కూటీ నడుపుతూ నడిచివెళ్తున్న వారిని ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం వేకువజామున పావులూరు రోడ్డులో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. మురుకొండ సింగయ్య, గోరంట్ల నాగేశ్వరరావు, భద్రయ్య ముగ్గురు పావులూరు రోడ్డులో వాకింగ్ చేస్తున్నారు. వీరిపైకి ఒక్కసారిగా స్కూటీ వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో సింగయ్య తలకు గాయాలు కాగా, మిగిలిన ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. స్కూటీ నడుపుతున్న వ్యక్తి వాహనాన్ని అక్కడే విడిచి పరారయ్యారు. పోలీసు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

పావులూరులో నేత్రదానం

ఇంకొల్లు, సెప్టెంబరు 22 : మండలంలోని పావులూరులో నేత్రదానం జరిగింది. గ్రామానికి చెందిన మరెళ్ల కోటిరెడ్డి (95) మృతి చెందగా, ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ వారి ఆధ్వర్యంలో గుంటూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు నేత్రాలను సేకరించారు. ఇందుకు సహకరించిన కుటుంబ సభ్యులను కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి స్వామి, రోటరీ అధ్యక్షుడు రఫి అభినందించారు.

భర్త, అత్త వేధింపులపై కేసు

అద్దంకి, సెప్టెంబరు 22 : అదనపు కట్నం కోసం భర్త, అత్త వేధింపులకు గురి చేస్తున్నారని గోపిశెట్టి అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రవీణ తెలిపారు. అద్దంకి పట్టణంలోని రామ్‌నగర్‌కు చెందిన అనూషకు 11 సంవత్సరాల కిందట ఒంగోలు పట్టణంలోని పేర్నమిట్టకు చెందిన గోపిశెట్టి అనిల్‌కుమార్‌తో వివాహం జరిగింది. ఒక పాప కూడా ఉంది. భర్త అనిల్ కుమార్ మద్యం సేవించి వచ్చి అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని, కొడుతున్నారని, అత్త రమణమ్మకు చెప్పినా సూటిపోటి మాటలతో చిత్రహింసలకు గురిచేస్తుందని అనూష ఆదివారం అద్దంకి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దాడి ఘటనపై కేసు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), సెప్టెంబర్ 22 : ఇంటర్ విద్యార్థిపై దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులపై ఈపూరుపాలెం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని కుమ్మరి వారి వీధికి చెందిన కొడాలి చంద్రశేఖర్ గత శనివారం రాత్రి సమయంలో అదే గ్రామంలోని మార్కెట్ సమీపంలో పానీపూరీ తింటున్నాడు. ఈక్రమంలో ముగ్గురు యువకులు మద్యం మత్తులో అక్కడికి వచ్చారు. చంద్రశేఖర్‌తో గొడవ పడ్డారు. వెంటనే రాయితో తలపై, శరీరంపై దాడి చేశారు. దీంతో చంద్రశేఖర్ తలకు తీవ్ర గాయమైంది. బాధితుడు చీరాల ఏరియా వైద్యశాలలో చేరి చికిత్స పొందాడు. ఈ ఘటనపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


భారీ ఊరేగింపుగా నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు

ముగిసిన వినాయక నిమజ్జన వేడుకలు

పర్చూరు, సెప్టెంబరు 22 : వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రతిమలను మూడు, ఐదు, తొమ్మిది రోజుల సందర్భంగా నిమజ్జనాలు చేశారు. మిగిలి ఉన్న విగ్రహాలను ఆదివారం వైభవంగా నిమజ్జనాలు చేశారు. పర్చూరులోని టీనగర్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాన్ని భారీ ఊరేగింపు నడుమ డీజే, బాణసంచా కాల్చుతూ భక్తులు నిమజ్జనానికి చీరాల వాడరేవుకు తరలించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి రావడంతో పర్చూరు బొమ్మల సెంటర్ కిటకిటలాడింది. పండుగ వాతావరణం కన్పించింది. ఎలాంటి వివాదాలకు తావులేకుండా పోలీసుల పర్యవేక్షణలో నిమజ్జన ఊరేగింపు కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది.

సాహిత్య ప్రతిభామూర్తులకు పురస్కారాలు


సత్కారం అందుకున్న సాహితీ వేత్తలు

చీరాలటౌన్, సెప్టెంబరు 22 : ఆధునీకీకరణలో కూడా సాహితీ, సాంస్కృతిక రంగాల్లో నిరంతరంగా అంకితమవుతున్న ప్రతిభామూర్తులను సత్కరించుకోవడం ఆనందదాయకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం రోటరీ క్లబ్‌లో సహజ సాహితీ చీరాల వారి ఆధ్వర్యంలో పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. సభాధ్యక్షులుగా కోడూరి ఏకాంబరేశ్వరబాబు వ్యవహరించగా ముఖ్య అతిథులుగా బండారుపల్లి హేమంత్‌కుమార్, పోలుదాసు రామకృష్ణ హాజరయి ఉపన్యసించారు. ప్రతినిధులు బత్తుల బ్రహ్మారెడ్డి, నూనె అంకమ్మరావు, గాదేపల్లి దివాకరదత్, అన్నపురెడ్డి వీరారెడ్డి, రాజేంద్రప్రసాద్, భాగి కృష్ణమూర్తి, అక్కిరెడ్డి, వెంకట రమణారెడ్డిలను సత్కరించారు. కార్యక్రమంలో వడలి రాధాకృష్ణ, వెంకటేశ్వరరావు, సీతారామాంజనేయ శర్మ, దయాకరరెడ్డి, పవని భానుచంద్రమూర్తి, నాగమాంబ హాజరయ్యారు.

జ్వరాలు తగ్గాలని గ్రామదేవతకు పొంగళ్లు


గ్రామోత్సవంగా వెళ్తున్న భక్తులు



బల్లికురవ, సెప్టెంబరు 22 : మూడు నెలలుగా ముక్తేశ్వరం గ్రామాన్ని విష జ్వరాలు వణికిస్తున్నాయి. ప్రతి ఇంటిలోనూ కుటుంబ సభ్యులు జ్వరాలతో మంచంపట్టారు. జ్వరాలు తగ్గినట్టే తగ్గి మళ్లీమళ్లీ విజృంభిస్తున్నాయి. దీంతో గ్రామానికి చెందిన ప్రజలు సమిష్టిగా దేవుడే తమకు దిక్కు అని గ్రామ దేవత పోలేరమ్మకు ఆదివారం ప్రజలు పొంగళ్లు నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి పొంగలి, చద్ది చేసుకొని భక్తులు గ్రామోత్సవంగా పోలేరమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకొన్నారు. తమను కాపాడాలని వేడుకొన్నారు. విష జ్వరాలబారిన పడి తాము పడుతున్న ఇబ్బందులు తీర్చాలని మొక్కుకున్నారు. అనంతరం బొడ్డురాయికి బిందెలతో నీటిని పోశారు. గతంలో ఎన్నో ఏళ్ల కిందట కూడా ఇలాగే పూజలు నిర్వహించామని గుర్తు చేశారు. గ్రామంలో సీజనల్ వ్యాధులు పెరినందువల్లే అమ్మవారికి పొంగళ్లు పెట్టామని గ్రామ పెద్దలు తెలిపారు. అనంతరం గ్రామస్థులు కుటుంబాలవారీగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మహిళ భక్తులు అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి సాయం

మార్టూరు, సెప్టెంబరు 22 : మండలంలోని చిమ్మిరిబండ గ్రామానికి చెందిన బొంతా సురేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. దాంతో అతని వైద్య ఖర్చులు నిమిత్తం చారిటీ బాక్స్ సంస్థ అధ్యక్షుడు లక్కోజి నూకరాజు రూ.10వేల సాయాన్ని అందజేశారు. అలాగే సంస్థ ప్రతినిధులు గ్రామస్థుల నుంచి సేకరించిన రూ.55వేలను బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రావినూతల యోహాను, శ్రీధర్, రవి, సింగారావు పాల్గొన్నారు.

లక్ష మందికి కంటి ఆపరేషన్‌లే లక్ష్యం

- రాజకీయాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు
- ఎమ్మెల్యే ఏలూరి
- వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, సెప్టెంబరు 22 : చూపును కోల్పోయి పేదరికంలో ఉన్న రోగులకు ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించి వారి జీవన ప్రమాణాలను పెంపొందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఆదివారం వైఆర్ హైస్కూల్ ప్రాంగణంలో ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, సేవా అగ్రిటెక్ సౌజన్యంతో శంకర్ కంటి వైద్యశాల బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ఏలూరి ప్రారంభించారు. తొలుత స్వర్గీయ నందమూరి తారక రామారావు, కీర్తిశేషులు ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవే లక్ష్యంగా తన తండ్రి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం ఏలూరి ట్రస్ట్ ద్వారా 13 ఏళ్లుగా ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 200లకు పైగా క్యాంపుల ద్వారా వేలాది మందికి శస్త్ర చికిత్సలు చేయించామన్నారు. రాజకీయాలకు అతీతంగా లక్ష మందికి కంటి చూపును ఇవ్వడమే తన లక్ష్యమని ఏలూరి స్పష్టం చేశారు. వైసీపీ పాలనలో సేవా కార్యక్రమాలను కూడా రాజకీయం చేసిందని, కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేసేందుకు అనుమతులను నిరాకరించిందని ఏలూరి గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజా సేవే పరమావధిగా ముందుకు సాగుతోందని తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ తెలుదేశం పార్టీ అధ్యక్షుడు సలగల రాజశేఖర్‌బాబు, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెదపూడి విజయ కుమార్, రాష్ట్ర కార్యదర్శులు దాసరి ఉషారాణి, కారుమూరి కృష్ణ ప్రజా కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.


వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

600 మందికి వైద్య పరీక్షలు

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆయా గ్రామాల నుంచి 600లకు పైగా రోగులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. పెద్ద ఎత్తున రోగులు తరలి రావడంతో ప్రాంగణం కిక్కిరిసింది. రోగులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. వైద్య పరీక్షలు అనంతరం రోగులకు భోజన వసతిని కూడా కల్పించారు. వైద్య పరీక్షలకు హాజరైన రోగులను ఏలూరి ఆప్యాయంగా పలుకరించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

ముఖ మండపానికి రూ.లక్ష విరాళం

అద్దంకి, సెప్టెంబరు22: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖ మండపం నిర్మాణానికి నెల్లూరు జిల్లా కలిగిరి మండలం లక్ష్మీపురానికి చెందిన చుండూరి వీరయ్య జ్ఞాపకార్థం భార్య సుబ్బాయమ్మ, కుమారుడు సుబ్బారావు రూ.లక్షను ఆదివారం దేవాలయ సిబ్బంది శ్రీనివాసరావు కు అందజేశారు.

రేపటి నుంచి పొలంపిలుస్తోంది

అద్దంకి, సెప్టెంబరు 22 : పొలం పిలుస్తోంది కార్యక్రమాలు మంగళవారం నుండి ప్రారంభమవుతాయని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకట కృష్ణ తెలిపారు. మంగళవారం ఉదయం ధర్మవరం, సాయంత్రం శంఖవరప్పాడు, బుధవారం ఉదయం కలవకూరు, సాయంత్రం శింగరకొండపాలెం లో జరుగుతాయని తెలిపారు.

వాగు గండ్లు పూడ్చివేత

- రైతుల విన్నపానికి స్పందించిన ఎమ్మెల్యే
- ఏలూరి సూచనలతో పనులు ప్రారంభం


ఎక్స్‌కవేటర్‌తో గండ్లు పూడుస్తున్న సిబ్బంది

పర్చూరు, సెప్టెంబరు 22 : గతంలో తుఫాన్ కారణంగా కారంచేడు మండల పరిధిలోని రామానాయుడు వారధి సమీపంలోని వాగుకు గండ్లు పడ్డాయి. అప్పటి నుంచి గండ్లు పూడ్చలేదు. దీంతో రైతులు గండ్లు పూడ్చకపోతే పొలాలకు ముంపు తప్పదని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఏలూరి వారధి సమీపంలోని జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్‌కు మరమత్తులు చేయాలని సూచించారు. వారు గండ్లను పూడ్చివేసే పనులు చేపట్టారు. టీడీపీ నేతలు పోతిన ఉదయ్, రావూరి సుబ్బారావు తదితరులు పనులను పర్యవేక్షిస్తున్నారు.

చంద్రబాబు పాలనతోనే రాష్ట్రాభివృద్ధి


మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగరాజు

చీరాల, సెప్టెంబరు 22 : ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొడుగుల గంగరాజు అన్నారు. మండల పరిధిలోని సాల్మన్ సెంటర్ పంచాయతీ పరిధిలో ఆదివారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ 100 రోజుల పాలనలో ప్రజలకు చేకూరిన ప్రయోజనాలు, జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. కూటమి ప్రభుత్వం ప్రజల కోసం పనిచేసేదన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కోటమ్మ, ఆళ్ల సాంబయ్య, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నాగరాజుపల్లిలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళి కృష్ణ, మిన్నెకంటి రవి కుమార్, పోతురాజు, సాంబశివరావు, సర్పంచ్ దాసరి నరేంద్రబాబు పాల్గొన్నారు.

రాజుపాలెంలో రెండు సీసీ రోడ్లకు శంకుస్థాపన

మార్టూరు : మండలంలోని రాజుపాలెం గ్రామంలో ఆదివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రూ.10లక్షల వ్యయంతో నిర్మించనున్న రెండు సిమెంట్ రోడ్లకు ఎంపీడీవో జీ నితిన్ శంకుస్థాపన చేశారు. అంతకుముందు గ్రామంలో కూటమి ప్రభుత్వం వంద రోజులలో చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ అధికారులు, టీడీపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. తరువాత గ్రామసభను నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ జాష్టి వెంకటనారాయణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అడుసుమల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ గర్నెపూడి


ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో నితిన్, నాయకులు